సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 15-12-2023 15/-













## గుణపాఠాలు






# గీటురాయి

సహజీవన భావనల పొదురాయి

వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Email : geeturaiweekly@gmail.com

Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి 45 సంచిక: 50 హైదరాబాద్
శుక్రవారం 15 డిసెంబర్ 2023 రూ.15-00
1 జమాదివుల్ ఆఖిర్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

**జనులారా! అల్లాహ్‌ను మీ తప్పులకు క్షమాపణకై వేడుకోండి! ఆయన వైపునకే మరలండి. నేనైతే రోజుకు వందేసి సార్లు క్షమాపణకై అర్థిస్తూ ఉంటాను.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


## లోపల...


| | | |
|---|---|---|
| మలుపు తిప్పిన ముస్లిం ఓట్లు | ...... | 04 |
| గుణపాఠాలు | ...... | 05 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)-8 | ...... | 08 |
| చరితార్థులు-2 :ముహమ్మద్ అబ్దుల్లా | ...... | 11 |
| స్వాతంత్ర్య పోరాటంలో హిందూ ముస్లిం సఖ్యత | ...... | 12 |
| ఆత్మశుద్ధి | ...... | 14 |
| అందలం ఎక్కాడమ్మా అందకుండా పోరాదమ్మా | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| అంతిమ దైవ సందేశహరుని ప్రభవనానికి పూర్వం .... | ...... | 20 |
| మౌనంగా ఉండడం అంటే... | ...... | 22 |
| జామియా ఉస్మానియా నూరేళ్ళ విద్యా వనం | ...... | 24 |
| ఈ పిల్లలకు ఏమైంది? | ...... | 30 |
| ప్రజా తీర్పు | ...... | 34 |


**ఇక రే'వంతు'....**




అంగరంగ వైభవంగ
రేవంతుడి ప్రమాణం
ఆరు గ్యారంటీలతో
సాగుద్దట ప్రయాణం!
మంచిగ అమలైతేనే
నిలుస్తదంట పరువు
ఏమాత్రం అటు ఇటైన
వేస్తారు జనం దరువు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# మలుపు తిప్పిన ముస్లిం ఓట్లు

**తెలంగాణలో** ముస్లిం ఓట్లు రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పాయి. కాంగ్రెసు ఘనవిజయానికి కారణమయ్యాయి. రాష్ట్ర జనాభాలో ముస్లిములు 13 శాతం ఉన్నారు. దాదాపు 45 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ముస్లిం ఓట్లు నిర్ణయాత్మకంగా ఉన్నాయి.

ముస్లిం ఓట్లు కాంగ్రెసు వైపు మొగ్గు చూపడానికి ముఖ్యమైన కారణాల్లో ఒకటి జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణా విభాగం ప్రకటించిన మద్దతు. మొత్తం 69 స్థానాల్లో జమాఅత్ కాంగ్రెసుకు మద్దతిచ్చింది. పార్టీ ప్రాతిపదికన కాకుండా అభ్యర్థుల ప్రాతిపదికన జమాఅత్ మద్దతు ఇచ్చినప్పటికీ, అత్యధికంగా కాంగ్రెసు అభ్యర్థులకే మద్దతు లభించిందన్నది స్పష్టం. ఈ నియోజక వర్గాల్లో ముస్లిం ఓటర్లను ఈ నిర్ణయం ప్రభావితం చేసింది. ఈ నియోజకవర్గాలే కాకుండా వాటికి ఆనుకుని ఉన్న నియోజక వర్గాల్లో కూడా ముస్లిం ఓటర్లపై ఈ ప్రభావం పడింది.

మరోవైపు తెలంగాణ ముస్లిం సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కూడా కాంగ్రెసుకు షరతులతో కూడిన మద్దతిచ్చింది. రాష్ట్రంలోని ముస్లిములందరూ సమైక్యంగా కాంగ్రెసుకు ఓటు వేయాలని పిలుపునిచ్చింది. కాంగ్రెసు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోగా ముస్లిం డిక్లరేషనులోని వాగ్దానాలు అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావడానికి ఈ మద్దతు నిర్ణయం ఉపయోగపడుతుందని ప్రకటించింది. ఎన్నికల తేదీకి వారం ముందు ఈ ప్రకటన వచ్చింది. ఈ ప్రకటన కూడా ముస్లిములను ప్రభావితం చేసింది. అయితే ముస్లిములు కాంగ్రెసుకు ఇచ్చిన మద్దతు కాంగ్రెసు పని తీరుపై ఉంటుందని, రానున్న రోజుల్లో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోకపోతే రానున్న సాధారణ ఎన్నికల్లో ఈ మద్దతు కాంగ్రెసుకు ఉండదని కూడా జాక్ స్పష్టం చేసింది.

ఈ ప్రకటనలు ముస్లిం ఓట్లు చీలిపోకుండా కాపాడాయి. ముఖ్యంగా మహబూబ్ నగర్, హుజూర్ నగర్, వరంగల్ ఈస్ట్, ఖమ్మం, బోధన్, ఇబ్రాహీం పట్నం, షాద్ నగర్, రామగుండం, నిజామాబాద్ రూరల్, నల్గొండల్లో ఎన్నికల ఫలితాలపై ప్రభావం వేశాయి. బీఆరెస్ పార్టీలో ముస్లిం నేతలెవ్వరు చెప్పుకోదగ్గవారు లేరు. మజ్లిస్ పార్టీతో బీఆరెస్ స్నేహాన్ని చూపించి ముస్లిం ఓట్లను పొందాలనుకున్న ప్రయత్నం ఫలించలేదు. 2014, 2018 ఎన్నికల్లో బీఆరెస్ పక్షాన నిలబడిన ముస్లిం ఓటర్లు ఈ సారి కాంగ్రెసును బలపరిచారు.

బీజేపీ అగ్రనాయకులు ఈటెల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావులు ఈ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఇది బీజేపీకి ఊహించని ఎదురుదెబ్బ. ముస్లిం ఓట్లు సమైక్యంగా పోలవ్వడమే ఈ ఫలితాలకు కారణం. గతంలో మాదిరిగా ముస్లిం ఓట్లు ఈ సారి చీలిపోలేదు. ఈటెల రాజేందర్ బీఆరెస్‌ను వదిలి బీజేపీలో చేరిన నేత. ఈయన పోటీ చేసిన గజ్వేల్‌లోను, హుజురాబాద్‌లోను రెండు చోట్ల ఓడిపోయారు. బండి సంజయ్ బీజేపీ ప్రముఖ నాయకుడు. కరీంనగర్ ఎం.పీ. ఈయన కరీంనగర్‌లో ఓడిపోయారు. నిజామాబాద్ ఎం.పీ ధర్మపురి అరవింద్ కోరుట్లలో ఓడిపోయారు. రఘునందన్ రావు దుబ్బాకలో ఓడిపోయారు.

అయితే కామారెడ్డిలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి కె. వెంకట రమణా రెడ్డి తన ప్రత్యర్థులు రేవంత్ రెడ్డిపై, కేసీఆర్ పై గెలవడం చెప్పుకోదగ్గ విషయం. కాంగ్రెసు, బీఆరెస్ అగ్రస్థాయి నేతలిద్దరు ఇక్కడ పోటీలో ఉండడం వల్ల ముస్లిం ఓట్లు చీలిపోయాయన్నది స్పష్టం. అలాగే గత ఎన్నికల్లో కేవలం ఒకే ఒక్క స్థానంలో గెలిచిన బీజేపీ ఈసారి ఎనిమిది స్థానాల్లో గెలుపు నమోదు చేసింది.

కాంగ్రెసు, బీఆరెస్ మధ్య ముస్లిం ఓట్లు చీలిపోయే పరిస్థితి ఈసారి బీజేపీకి కొన్ని నియోజకవర్గాల్లో ఉపయోగపడింది.

ఏది ఏమైనా ఈ ఎన్నికలు బీఆరెస్‌కు మొదటి సారి ఓటమి అనుభవంలోకి వచ్చేలా చేశాయి. ముస్లిం రాజకీయ ప్రాతినిథ్యం పట్ల నిర్లక్ష్యం చూపించడం, ముస్లిములకు టిక్కెట్లివ్వకపోవడం, ముస్లిం నాయకత్వాన్ని ప్రోత్సహించకపోవడం, కేంద్రస్థాయిలో అనేక నిర్ణయాల్లో ముస్లిం మనోభావాలను గౌరవించకుండా బీజేపీకి మద్దతుగా నిలబడడం ఇలాంటి అనేక కారణాలు ముస్లిములు బీఆరెస్‌కు దూరమయ్యేలా చేశాయి. ఇప్పటికైనా బీఆరెస్ నాయకత్వం తప్పులు దిద్దుకుంటుందా? ✤

అబ్దుల్ వాహెద్




# గుణపాఠాలు

**ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిశాయి.** సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఫలితాలు దేశంలోని ప్రతిపక్ష పార్టీలకు, ముఖ్యంగా కాంగ్రెస్ కు మరిచిపోకూడని గుణపాఠాలు నేర్పుతున్నాయి. ఎన్నికల వ్యూహాలు, ప్రచారం, ప్రజా సంబంధాల విషయంలో కష్టపడకుండా ఫలితాలు రావన్నది బీజేపీని చూసి కాంగ్రెస్ నేర్చుకోవాలి. బీజేపీని ఓడించడానికి షార్ట్ కట్ దారులేవీ లేవన్నది కాంగ్రెస్ ఇప్పటికైనా గుర్తించాలి. తెలంగాణలో విజయం ఒక్కటే కాంగ్రెసుకు సాంత్వన. మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంగ్రెసు నేతలు బీజేపీకి పోటీగా సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలతో నెట్టుకురావాలని చేసిన ప్రయత్నాలు మరోసారి బెడిసికొట్టాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ ఇప్పుడు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉంది. కాంగ్రెసు ఎక్కడ ఉందో భారత్ జోడో యాత్రికులు ఆలోచించుకోవాలి.

మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, రాజస్థాన్ లలో ఓటమికి ముఖ్యమైన కారణం అతినమ్మకం. ఈ ఎన్నికల్లో ఈ మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ చాలా బలంగా ఉందన్న అతినమ్మకమే కాంగ్రెసును ముంచింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కేంద్ర నిఘా సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష నేతలను వేధిస్తుందని తరచు ఆరోపించే ప్రతిపక్ష నేతలు ఎన్నికల సమయంలో ఐక్యతను చూపలేకపోతున్నారు. సీట్ల సర్దుబాటుకు సిద్ధం కాలేకపోతున్నారు. అభ్యర్థుల విషయంలో స్వార్థ ప్రయోజనాలను వదులుకోలేకపోతున్నారు. ఫలితం కళ్ళ ముందు కనబడుతోంది.

ప్రతిపక్షాలన్నీ కలిసి ఇండియా కూటమిని ఏర్పాటు చేశాయి. మొత్తం 27 పార్టీలు ఈ కూటమిలో ఉన్నాయి. వచ్చే సంవత్సరం సాధారణ ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీ చేయాలని నిర్ణయించాయి. కాని సాధారణ ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలను సెమీఫైనల్‌గా బీజేపీ భావిస్తే, కాంగ్రెసు మాత్రం భారత్ జోడోతో బలం చాలా పెరిగిపోయిందన్న అపోహలో కొట్టుకుపోయింది. మరోవైపు కమల్ నాథ్, అశోక్ గెహ్లోత్, భూపేష్ భాగేల్ వంటి నేతలు ఇతర పార్టీలతో పొత్తు అవసరమే లేదన్న అహంకారాన్ని ప్రదర్శించారు. ఇండియా కూటమి పొత్తులు కేవలం సాధారణ ఎన్నికలకు మాత్రమేనని, రాష్ట్రాల ఎన్నికల్లో పొత్తులు అవసరం లేదనుకు

న్నారు. ఈ వైఖరిని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఆమోదించడం విచిత్రం. ఆ తర్వాత బీజేపీకి పూర్తి అవకాశం కాంగ్రెస్ స్వయంగా ఇచ్చింది. ఇండియా కూటమిలోని ప్రముఖ పార్టీ సమాజవాది పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ ఈ విషయమై ప్రశ్నించారు కూడా. ఇండియా కూటమిగా రాష్ట్రాల ఎన్నికల్లో పోటీ చేయాలని కోరాడు. కాని మధ్యప్రదేశ్ కాంగ్రెసు నాయకుడు అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యలను కించపరుస్తున్నట్లు, అఖిలేష్, గిఖిలేష్ గురించి నాకు చెప్పకండి అంటూ గర్వంగా వ్యాఖ్యానించాడు. ఇండియా కూటమి నిషేధించిన యాంకర్లలో ఒక యాంకరును పిలిచి మరీ ఇంటర్వ్యూ ఇచ్చి కూటమి నిర్ణయాల పట్ల తనకు ఎంతమాత్రం గౌరవం లేదన్న అహంకారాన్ని ప్రదర్శించాడు. ఈ నేతలు పొత్తులకు సిద్ధపడలేదు. సమాజవాది పార్టీతోను ఇతర చిన్న పార్టీలతోను పొత్తులు పెట్టుకుని ఉన్నట్లయితే బహుశా కాంగ్రెసు పరిస్థితి మరోలా ఉండేది. క్షేత్రస్థాయిలో కార్యకర్తల బలం పెరిగేది. కేవలం మధ్యప్రదేశ్ మాత్రమే కాదు, రాజస్థాన్, చత్తీస్ గఢ్ రాష్ట్రాల్లోను కాంగ్రెస్ నేతలు పొత్తులకు సిద్ధం కాలేదు. ఈ సారి కూడా బీజేపీ తన ఎన్నికల ఎత్తుగడల్లో విజయం సాధించింది. బీజేపికి వ్యతిరేకంగా అనేకమంది ప్రత్యర్థులు నిలబడే వాతావరణంలో ఓట్లు చీలిపోయే పరిస్థితిని తనకు అనుకూలంగా మరల్చుకుంది.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అగ్రనేతలు సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలతో బీజేపీపై గెలవవచ్చని అనుకున్నారు. ఇలాంటి ప్రయత్నాలు ఇంతకుముందు కూడా కాంగ్రెసు చాలా సార్లు చేసి తలబొప్పి కట్టిన అనుభవాలున్నాయి. అయినా గుణ పాఠాలు నేర్చుకోలేదు. మధ్యప్రదేశ్ లో కమల్ నాథ్ బాహాటంగా బాబాలకు సాగిలపడడాన్ని ఓటర్లు చూశారు. హిందూత్వ కావాలనుకునే ఓటర్లకు హిందూత్వ విషయంలో కాంగ్రెసు కన్నా మెరుగైన బీజేపీ ఉన్నప్పుడు కాంగ్రెసుకు ఎందుకు ఓటు వేస్తారు? హిందూత్వ రాజకీయాల పట్ల తటస్థ వైఖరి ఉన్నవారు కూడా మతతత్వ రాజకీయాల విషయంలో కాంగ్రెసుకు, బీజేపీకి తేడా లేనట్లుగా కనిపిస్తున్నప్పుడు కాంగ్రెసుకు ఎందుకు ఓటు వేస్తారు? హిందూత్వ రాజకీయాలు వద్దనుకునే ఓటర్లు కూడా కాంగ్రెసు వైఖరి పట్ల విసిగిపోయారు. మధ్యప్రదేశ్ మాత్రమే కాదు, ఛత్తీస్‌గఢ్ లోను పరిస్థితి ఇదే. ఛత్తీస్‌గఢ్‌లో మతఘర్షణల్లో మరణించిన భువనేశ్వర్ సాహూ కుటుంబానికి ఛత్తీస్‌గఢ్ కాంగ్రెసు ప్రభుత్వం పదిలక్షలు సహాయం అందించింది. అవే మత ఘర్షణల్లో మరణించిన ఇద్దరు ముస్లిముల కుటుంబాలకు అలాంటి సహాయమేదీ ఇవ్వలేదు. 2018లో అధికారంలోకి రాగానే ఆవుపేడ, గోమూత్రాలతో ఛత్తీస్ గఢ్ కాంగ్రెస్ నేతలు రాజకీయాలు మొదలు పెట్టారు. ఆవుపేడ, గోమూత్రాలను సేకరించే పథకం ప్రవేశపెట్టారు. జీవమిత్ర, బ్రహ్మాస్త్ర అనే ఎరువులను తయారు చేయడానికి సేకరిస్తున్నట్లు చెప్పారు. ఆరెస్సెస్ ఈ పథకాన్ని మెచ్చుకుంది. బీజేపీ ఈ ప్రయత్నాలను అవహేళన చేసింది. యువకులకు ఉద్యోగాలు ఇవ్వకుండా పేడ ఎత్తే పనిలో ప్రభుత్వం పెడుతుందని ఎగతాళి చేసింది. భాగేల్ ప్రభుత్వం గుడులు కట్టడంలో అత్యంత ఉత్సాహం చూపించింది. మరోవైపు క్రయిస్తవ వ్యతిరేక హింసాకాండలోను భాగేల్ ప్రభుత్వం సాఫ్ట్ హిందూత్వ వైఖరి బయటపెట్టుకుంది. కాని ఈ సాఫ్ట్ హిందూత్వ కార్డు భాగేల్‌కు ఉపయోగపడలేదు. హిందూత్వ ఓటర్లెవరు ఆయనకు ఓటు వేయలేదు.

రాజస్థాన్ లో పరిస్థితిని గమనిస్తే ప్రతి సారి ప్రభుత్వాన్ని మార్చే రాజస్థాన్ ఓటర్లు ఈ సారి కూడా ప్రభుత్వాన్ని మార్చారు. నిజానికి గెహ్లాత్ ప్రభుత్వం చక్కటి పరిపాలన అందించింది. కాంగ్రెసు ఇక్కడ ఓడిపోవడానికి ముఠా కుమ్ములాటలు కారణం. అభ్యర్థులను నిలబెట్టడంలో ఈ ముఠాలకే ప్రాముఖ్యత లభించడంతో ప్రజల్లో అభ్యర్థుల పట్ల వ్యతిరేకత పెరిగింది. దాంతో పాటు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ పరీక్షల పేపర్లు లీక్ కావడం కూడా మరో కారణం. దాంతో పాటు కన్నయ్య కుమార్ హత్యను మతతత్వ రాజకీయాలకు బీజేపీ వాడుకోవడం కూడా బీజేపికి కలిసి వచ్చింది. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఓటమిని, తెలంగాణలో బీఆరెస్ ఓటమిని పరిశీలిస్తే కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుస్తాయి. రెండు రాష్ట్రాల్లోను ప్రభుత్వాలు ప్రజాసంక్షేమ పథకాలకు ప్రాముఖ్యం ఇచ్చాయి. కాని రెండు రాష్ట్రాల్లోను పాలకపార్టీ గర్వాతిశయాన్ని ప్రదర్శించింది. సంక్షేమ పథకాలు ప్రకటించడంలో చూపించిన ఉత్సాహం సంక్షేమం ప్రజల వద్దకు వెళ్ళడంలో చూపించలేదు. మతతత్వ రాజకీయాల పట్ల ఖచ్చితమైన వ్యతిరేకతను రాజస్థాన్ కాంగ్రెస్ నేతలు ప్రదర్శించలేదు. మహిళల భద్రత విషయంలో బీజేపీ ఆరోపణలకు సరైన జవాబు ఇవ్వలేకపోయారు. రాజస్థాన్ లో కాంగ్రెస్ ఓటమి వెనుక కారణాలను విశ్లేషించుకోవడం పార్టీకి ఎంతైనా అవసరం.

ఈ ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కులజనగణన గురించి నొక్కి మాట్లాడారు. బీజేపీ మతతత్వ రాజకీయాలకు విరుగుడుగా ఇండియా కూటమి నేతలు కూడా ఈ వ్యూహాన్ని అనుసరించాలనుకున్నారు. బీహారులో కులజన గణన నివేదికను విడుదల చేశారు. కాంగ్రెసు పాలిత రాష్ట్రాలు

తాము కూడా కులజనగణన నిర్వహిస్తామన్నాయి. ఓబీసి ఓటర్లను ఆకట్టుకోడానికి రాహుల్ గాంధీ కులజనగణన గురించి ఎంత మాట్లాడినా ఆయన తప్ప కాంగ్రెసులో మరో నాయకుడెవరు దీని గురించి మాట్లాడలేదు. మధ్యప్రదేశ్‌లో, చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు కుల జనగణన గురించి పొరబాటున కూడా ప్రస్తావించలేదు. రాజస్థాన్‌లో కూడా నేతలు దీని గురించి మాట్లాడలేదు. కాంగ్రెసు చెప్పే కుల జనగణనను ఓటర్లు నమ్మలేని పరిస్థితి వచ్చింది.

రాహుల్ గాంధీ ముహబ్బత్ కి దుకాన్ నినాదం ఉత్త నినాదంగానే మిగిలిపోయింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలు ముహబ్బత్ కి దుకాన్ అవసరం లేదనుకున్నారు. సాఫ్ట్ హిందూత్వతో పాటు అవకాశవాద రాజకీయాలు నడిపి గెలవగలమని భావించారు. కొత్తతరానికి అవకాశమిచ్చే బదులు పాతతరం వృద్ధనేతలే కొనసాగాలనుకున్నారు. కాంగ్రెస్ అనేక సంక్షేమపథకాల గ్యారంటీ ఇచ్చింది. నిన్నటి వరకు తాయిలాలు, రేవడీలంటూ విమర్శించిన బీజేపీ కూడా మారుతున్న రాజకీయ వాతావరణాన్ని గమనించి వెంటనే తన తరపున తాయిలాలు, రేవడీలు ప్రకటించడానికి వెనుకాడలేదు. కాంగ్రెస్ ఇచ్చే గ్యారంటీ కన్నా, బీజేపీ ఇచ్చే గ్యారంటీ బలమైందని ప్రచారం చేసింది.

ఏది ఏమైనా ఈ రాష్ట్రాల్లో ఎన్నికల తర్వాత బీజేపీ మతతత్వ రాజకీయాలు మరింత పెరుగుతాయని, సాధారణ ఎన్నికల వరకు రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతుందన్నది స్పష్టం. కాంగ్రెసును ముస్లిం పార్టీగా చిత్రించి ప్రచారం చేయడం కూడా కొనసాగుతుంది. ఈ ప్రచారాన్ని ఎదుర్కోడానికి కాంగ్రెస్ అనుసరించే సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలు, మధ్యప్రదేశ్ లో కమల్ నాథ్, చత్తీస్ గఢ్ లో భాగేల్ నడిపిన మాదిరి రాజకీయాలు కాంగ్రెసును మరింత బలహీనపరుస్తాయి.

వేలాది కిలోమీటర్లు భారత్ జోడో యాత్ర లో నడిచి ముహబ్బత్ కి దుకాన్ సందేశమిచ్చిన రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తికి ఈ సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలకు సంబంధమే లేదు. రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలు భారత్ జోడో స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తుంటే కాంగ్రెస్ గెలుపుపై నమ్మకం పెట్టుకోవడం అత్యాశే అవుతుంది. రాష్ట్రాల్లో ఈ నేతలను అదుపు చేయలేని అధిష్ఠానం ఎన్నికల్లో మంచి ఫలితాలను ఎలా ఆశించగలదు.

ఈ పరాజయాలు కాంగ్రెసులో పునరాలోచనలను, దిద్దుబాట్లను ప్రోత్సహిస్తాయా? వేచి చూద్దాం. ✤

## నమ్మినా నమ్మకపోయినా? 13

# భూమ్యాకర్షణ శక్తి

**గురుత్వాకర్షణ** శక్తి సిద్ధాంతం ప్రకారం వస్తువులకు ఆధారం లేకుంటే పైనుండి నేల రాలుతాయి. అయితే గురుత్వాకర్షణ శక్తి వున్నప్పటికీ చెట్టుకు వున్న కాయలు కాని, ఆకులు గాని నేల రాలవు. ఎందుకంటే చెట్టు లేక కొమ్మలు వాటిని గట్టిగా పట్టివుంచుతాయి. అలాగే అన్ని విధాల మానవ విలువలతో కూడుకున్న ఒక మనిషి తనలో వున్న మానవ సహజమైన మంచి భావాలు, మానాభిమానాలు, సద్వ్యవహార లక్షణాల కారణంగా అతను ఇతరులతో సరియైన రీతిలో ప్రవర్తిస్తాడు. అంటే ఈ విలువలు అతన్ని మానవతా దృక్పథంతో ప్రవర్తించేలా పట్టి వుంచుతాయి. దేవునిపై వున్న విశ్వాసం, దేవుని బోధనల కారణంగానే అతను ఇతరులతో మంచిగా ప్రవర్తిస్తాడు. దైవాజ్ఞలతో వున్న సంబంధ బాంధవ్యాలే అతన్ని మానవతా విలువలతో పట్టివుంచుతాయన్నమాట. ఇలాంటి దైవిక భావనలు వున్న కారణంగా మనిషి తన జీవితంలోని అన్ని రంగాలలో, కార్యక్షేత్రాలలో అన్యాయాలకు, హెచ్చుతగ్గులకు పాల్పడకుండా న్యాయంగా వ్యవహరిస్తాడు. తాను తన సృష్టికర్త యెడల కలిగివున్న విశ్వాసం, మరణానంతరం దేవుని ముందు హాజరై జవాబు చెప్పాలన్న భావనలే అతన్ని సమాజంలో ఓ సత్శీలునిగా ప్రవర్తించేలా చేస్తాయి. ఈ భావనలు మనిషిని క్రిందకు దిగజారనివ్వవు.

అయితే మనిషిలో ఈ మానవతా సుగుణాలు లోపిస్తే మనిషి పశువులా లేదా రాక్షసునిలా ప్రవర్తిస్తాడు. ఇలాంటి లక్షణాలు వున్న మనిషి అన్ని విధాల దిగజారుతాడు. నమ్మినా, నమ్మకపోయినా మనిషి సంకుచిత భావాలు, దురభిమానాలు, ద్వేషం, శృంగార విశృంఖల లక్షణాలు కలిగివుంటే అతనిలో మానవతా విలువలు మృగ్యమై మృగప్రాయుడవుతాడు. మానవతా విలువలు లేని కారణంగా అతను అన్ని విధాల క్రిందికి దిగజారిపోతాడు.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

అధ్యాయం -3

9

# నిర్ధారణాగ్రేసరుడు
# మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

## తిరుగుబాటు తుడిచివేత

అప్పటికే మదీనాకు వచ్చేసిన ఉసామా సేన సిపాయీలు విశ్రాంతి తీసుకుని చాలామటుకు కార్యరంగంలోకి కాలిడటా నికి సన్నద్ధులయి పోయారు. మహనీయ ఖలీఫా, వారిలో నుంచి కొందరిని తనతోపాటు తీసుకుని, కొందరిని మహ నీయ ఖాలిద్ బిన్ వలీద్ కు ఇచ్చి, మరికొందరిని మహనీయ ఇక్రిమాకు ఇచ్చి మరుసటిరోజు మదీనా పవిత్ర నగరికి కాస్త దూరాన జుల్ కస్సా అనే చోట ఆగమని పురమాయించారు. అక్కడ ఆయన ప్రభావపూర్వకంగా ప్రసంగించారు. అందులో,

“నేను దైవం మీద భరోసాతో సంకల్పం చేసుకున్నాను, దేశంలో నలు వైపులా తలెత్తిన ధర్మం పట్ల తిరుగుబాటును చిరకాలానికి తుద ముట్టించడానికి, ఓ సారి పూర్తిస్థాయి సైనిక చర్య గైకొని వారి శక్తిని అణచివేయాలని సంకల్పించు కున్నాను.”

ఆ తరువాత ఆయన సేనను ఏడు దళాలుగా విభజించి వాటిని ఏడు ప్రాంతాలకు పంపారు. అక్కడ ధార్మిక తిరుగు బాటుదారుల్ని కలసుకున్నప్పుడు వారికి అందజేయ వలసిం దని ఓ సందేశమూ పంపారు:

“ఈ సందేశాన్ని జన సమూహంలో, వారి నాయకుని సమక్షంలో వినిపించవలసిందని కోరడమయినది. దీన్ని విన్న తరువాత ఏ సముదాయం అజాన్ పిలుపు ద్వారా తన సమ్మతిని ఘోషిస్తుందో దాన్ని వదలి వేయడం జరుగుతుంది, లేక పోతే పోరు తప్పదు.”

ధర్మ భ్రష్టులయి తిరుగుబాటు చేసిన వారిలో చాలా మంది ఖలీఫా సందేశం, ఆయన నియమించిన సేనాని ని కలసు కున్న తరువాత తమకు అపార్థం కలిగించడం జరిగిందని తిరిగి మదీనా వచ్చి ముస్లిములయ్యారు. అలా చేయని వారు పోరాడి హతమయ్యారు. కొందరిని అగ్ర రాజ్యాలు తిరుగుబాటుకు పురి గొలిపాయి. అయితే వారిలోని అనుభవజ్ఞులయిన పెద్దలు వారికి నచ్చజెప్పారు, అటువంటి ఓ ఉదంతం చరిత్రలో లిఖించబడి ఉంది.

## సాధారణ హేతువు

అప్పటి బహ్రైన్‌లో ఓ తెగ ‘అబ్దుల్ ఖైస్’ ఇస్లామ్ స్వీకరించిన తరువాత స్థిరంగానే ఉండేది. కాని పర్షియా చక్రవర్తి పక్షాన అక్కడ మున్జిర్ బిన్ నోమాన్ గవర్నర్‌గా నియమితు డయ్యాడు. అతను కొందరు బాగా ఆరితేరిన మోసగాళ్ళ ద్వారా, “ముహమ్మద్ నిజంగానే దైవ ప్రవక్త అయినట్లయితే దివంగతులయ్యేవారు కారు” అని ప్రచారం చేయించాడు. అయితే ఆ తెగలో ఓ పెద్దమనిషి జారూద్ అనేవాడు ఉండేవాడు. పర్షియా గవర్నర్ తెగలో చేయిస్తున్న దుష్ప్రచా రాన్ని గురించి, తద్వారా తెగను ఇస్లామ్‌కు దూరం చేస్తున్నా

డని తెలిసి ఆయన తెగ వారిని సమావేశ పరిచి ఇలా సంబోధించారు,

“తెగ సోదరులారా! నేనొక విషయం మిమ్మల్ని అడుగుతాను, మీకు తెలిస్తే చెప్పండి, లేదా మౌనం వహించండి.”

దానికి తెగవారు, “అడగండి, మీరు మా మేలుకోరే వారే.” అన్నారు.

“మీకు తెలుసా, దైవం లోగడ అనేక జాతుల్లో ప్రవక్తల్ని నియమించాడు?”

“అవును” తెగవారు బదులిచ్చారు.

“ఈ విషయం మీకు గత జనులు లేదా గ్రంథాల ద్వారా తెలిసిందా, లేదా మీరు ఆ ప్రవక్తల్ని కలసుకున్నారా?”

“గతించిన వారిని మేము ఎలా కలుసుకుంటాము? అయితే మేము గతించిన విషయాల్లో అన్నింటి కన్నా యదార్థమయిన విషయం, దైవ ప్రవక్తలు మునుపు కూడా వచ్చేవారన్నది!” తెగవారి జవాబు.

“మరయితే మీరు వారిని ఎందుకు కలసుకోలేదు” జారూద్ వేసిన మరో ప్రశ్న.

“వారు దైవం వద్దకు తిరిగి వెళ్లిపోయారు. వారిని కలసు కునేందుకు వారు ఈ ప్రపంచంలో లేరు. జనులు సమాధా నంగా చెప్పారు.

“ఏ విధంగానయితే గత ప్రవక్తలందరూ దైవం వద్దకు చేరి పోయారో అలాగే ప్రవక్త ముహమ్మద్(స) కూడా ఈ ప్రపంచాన్ని వీడి పరలోకానికి చేరుకున్నారు. ఆయన శిష్యుల్లో అందరికన్నా ఘనమయినవారు సీనియర్ సహచర మాన్యులు ఇప్పుడు ఆయన ఖలీఫా (ప్రతినిధి)గా వ్యవహ రిస్తున్నారు. ప్రవక్త శ్రీ అందజేసిన ధర్మాన్నే ఈయన కాపాడతారు.

## పరీక్ష!

మహనీయ జారూద్ అవగతపరచిన తీరు వల్ల తెగవారు బాగా ప్రభావితులయ్యారు. తాము ఇస్లామ్ పట్ల నిలకడ చూపుతామని, ఇక మీదట మీరే మా నాయకులని జారూద్ కు చెప్పారు. ఈ వివరాలన్నీ మున్జిర్‌కు తెలియగానే ఓ పెద్ద సేన తీసుకుని జరూద్ అతని తెగ పైన దాడి జరప పూను కున్నాడు. జారూద్ తెగ వారు కోట రక్షణ తీసుకుని ఖలీఫా అబూబక్ర్‌కు కబురంపారు. మహనీయ సిద్దీక్ అక్బర్, ఓ సేనానీ ‘ఉలా’ ఆధ్వర్యంలో నాలుగు వేల సైనిక దళం పంపారు. దారిలో ఇంకా రెండు తెగల బలం కూడా తోడయింది.

వారు ఓ చోట చీకటిపడగా మకాం వేశారు. తెల్లవారు నమాజ్ సమయానికి లేచే సరికి ఒంటెలూ వాటిపైని సామగ్రి అంతా మాయమయి పోయాయి. ముందుకు సాగలేని, వెనక్కి మరల లేని ఆ సందర్భంలో కేవలం దైవాన్ని ప్రార్థించడం తప్ప మార్గాంతరం లేదు. వారి సేనాని మండుతున్న ఇసుక పైన తల ఆనించి దైవాన్ని హృదయాంతరాళం లోనుంచి రోదిస్తూ ప్రార్థించడం మొదలెట్టారు.

సూర్యోదయం అయ్యే సమయానికి బహు దూరాన నీటి ఆనవాలు కనిపించింది. వారు వుజూ చేసుకుని దప్పిక తీర్చు కునే వరకు ఒంటెలన్నీ, సామానంతా మోసుకుని యథా తథంగా తిరిగి వచ్చేశాయి. ఈ సమాచారం తమ నాయకునికి తెలపగా ఆయన రెండు రక'తుల కృతజ్ఞతా ప్రార్థన చేసుకుని తన మిత్రుల మధ్య చేరారు. ఆ తరువాత ఆయన మున్జిర్‌ని ఎదుర్కొనేందుకు బహ్రైన్ చేరారు. అక్కడ జారూద్ కూడా తన తెగవారితో రాత్రి వేళ వచ్చి చేరారు.

ఓ నెల పాటు ఇరు వర్గాల మధ్య పోరు జరిగింది. దీనివల్ల మున్జిర్ సైనికులు అలసిపోయి ఓ రాత్రి వేళ బాగా త్రాగి నానా హంగామా చేయడం మొదలెట్టారు. ఉలా ఈ పరిస్థితిని గమనించి భీకరమయిన దాడి జరిపారు, అంతే, మున్జిర్ సేన బిత్తర పోయి చేతులెత్తేసింది. మున్జిర్‌ని బందీగా తీసు కున్నారు. బహ్రైన్ నుండి దైవ ధిక్కారుల్నీ, తిరుగుబాటు దారుల్నీ తుడిచిపెట్టడం జరిగింది. ఖలీఫా, మహనీయ ఉలాని బహ్రైన్ గవర్నర్‌గా నియమించారు.

అరబ్బు పల్లెవాసులు ఇస్లామ్‌కు ఎదురు తిరుగుతున్న కాలంలో అనేక ప్రాంతాల నుంచి వస్తున్న సమాచారాన్ని బట్టి సాయుధ బలగాలను సమర యోధులయిన నాయకుల ఆధ్వర్యాన పంపి ఎప్పటికప్పుడు వారు అపార్థాలకు గురయి ఉంటే ఆ అపార్థాలను దూరం చేయడానికి లేదా తలబిరుసు తనంతో తిరుగుబాటు చేసినా దాన్ని అణచడానికి తొలి ఖలీఫా ఏ విధమయిన జాగు చేయలేదు. ఫలితంగా అరేబియా అంతటా, ప్రవక్తశ్రీ (సల్లల్లాహుఅలైహివ సల్లమ్)కు పూర్వపు స్థితి నెలకొన్నది.

## 5. దొంగ ప్రవక్తల ప్రక్షాళన

తొలి ఖలీఫా మహనీయ అబూ బక్ర్ (ర) కాలంలో కొందరు దొంగ ప్రవక్తల సమస్య ఒకటి తలెత్తింది. ప్రవక్త శ్రీ(స)ని చూసిన తరువాత కొందరు దురాశాపరులు తాము కూడా

అలా ఏదయినా ప్రకటన ఎందుకు చేయకూడదని అనుకున్నారో ఏమో, ప్రవక్తశ్రీ (స) కనుమరుగు అవగానే తమలోని కుళ్ళు బయటపెట్టారు. తాము కూడా దైవ ప్రవక్తలమని ప్రకటించు కున్నారు. ఇటువంటి వారి నిర్మూలనకు ఖలీఫా అబూబక్ర్ (ర) ఒక వైపున మహనీయ ఖాలిద్ బిన్ వలీద్ (ర) ని, మరోవైపున ముహాజిర్ బిన్ ఉమయ్యా(ర)ని అవసరమయిన సాయుధ బలగాలతో పంపారు.

దొంగ ప్రవక్తలను నమ్మిన అనేక మంది యదార్థం బోధపరచిన తరువాత మారుమనసు పొంది, పశ్చాత్తాపంతో తిరిగి ఇస్లామ్ పరిధిలోకి వచ్చేశారు. అందరిలో చాలా బలవంతుడయిన దుష్టాగ్రేసరుడు 'ముసైలిమా,' ఆ పోరులో చిత్తు చిత్తుగా ఓడిపోయి, పారిపోవాలని అనుకున్నాడు. ఉహుద్ పోరులో మహనీయ హమ్జా(ర) ని అమరగతి పాల్జేసిన 'వహ్షీ' మక్కా విజయం సందర్భంలో ముస్లిమ్ అయ్యారు. ఆయన ఓ పేరు మోసిన తిరస్కారిని చంపి మహనీయ హమ్జాని హతమార్చిన దానికి పరిహారం తీర్చుకోవాలని కోరుకున్నారు, అప్పటికి ఇంకా ఆయన చేతిలో మహనీయ హమ్జాని చంపిన బళ్ళెమే ఉంది.

పారిపోతున్న తరుణంలో వహ్షీ కంట పడ్డాడు ముసైలిమా, అంతే, ఇదే సరయిన తరుణం అని, జాగు చేయకుండా వహ్షీ ఆ బళ్ళెం వాడి మీదికి విసిరారు. అది సరిగ్గా మెడలో నుంచి దూసుకుపోయింది. ఇక పోరు సాగలేదు. అప్పటికే 17వేల మంది హతులయ్యారు, వేల సంఖ్యలో సైనికులు గాయపడ్డారు.

అప్పుడు సేనాని ఖాలిద్ బిన్ వలీద్, తన చెరలో ఉన్న యమామా నాయకుడిని పిలిపించి, "నీవు నీ జాతి వారిని బోధించి చూడు, వారు నిండు హృదయంతో కప్పం కట్టి ఇస్లామీయ రాజ్య భద్రతలో, జిమ్మీలయి ఉండటానికి సమ్మతించి ప్రమాణం చేసే మాటయితే వారిని వదలి పెట్టడం జరుగుతుంది. లేదా పోరు తప్పదు" అని ఆదేశించారు. అతను తిరిగి వచ్చి యమామా ప్రజలు ఇంకా ఏదో షరతు పెట్టి అంగీకరించారని తెలిపాడు. మహనీయ ఖాలిద్ బిన్ వలీద్(ర), అనవసరంగా రక్తం చిందించరాదన్న ఖలీఫా పాలిసీ, ఆయన నిర్దేశన తెలిసినవారు కాబట్టి, వాటిని అంగీకరించి సంధీ ఒప్పందం చేసుకున్నారు.

## మరో దొంగ ప్రవక్త!

యమన్‌లోని ఓ కహతానీ తెగ నాయకుడు అస్వద్ కూడా తాను ప్రవక్తనని దావా చేశాడు. యమన్ పల్లెవాసులు అతన్ని నమ్మారు కూడా. వారి సహకారంతో అస్వద్ నజ్రాన్ పైన తన ఆధిపత్యాన్ని స్థాపించుకున్నాడు. అక్కడ ఓ తెగ అతనికి తోడయింది. ఆ పైన అతను యమన్ ప్రధాన నగరం 'సన్ఆ' వైపునకు పురోగమించాడు. అక్కడ పర్షియన్ గవర్నర్ పైన కూడా విజయం సాధించాడు. ఈ విజయ పరంపర వల్ల అస్వద్‌లో గర్వం పెరిగింది.

అస్వద్ గర్వంలో కళ్ళు మూసుకు పోయి తన సేనాధిపతి కైస్ పట్ల దురుసుగా ప్రవర్తించాడు. కైస్ అతన్ని చీదరించుకున్నాడు. అక్కణ్ణుంచి నేరుగా పర్షియన్ సేనా నాయకులతో కలసి, వారి ఓ సిపాయీ ఫీరోజ్ చేత అస్వద్‌ని హత్య చేయించాడు. యమన్‌లో హృదయ పూర్వకంగా ఇస్లామ్ స్వీకరించిన కొన్ని కుటుంబాలుండేవి. వారు ఈ సమాచారమంతా ఎప్పటికప్పుడు ప్రవక్త శ్రీ (స)కి చేరవేయాలని యత్నించారు. ఆ సమాచారం మోసుకు వచ్చిన వ్యక్తి మదీనా చేరే వరకు ప్రవక్తశ్రీ పరమపదించారు.

ఆ సందర్భంలో ప్రవక్త శ్రీ(స) పరమపదించిన వార్త యమన్‌కు చేరగా, అస్వద్ అనుయాయులు, మద్దత్తు దారులూ ముస్లిముల మీద అత్యాచారాలు దౌర్జన్యాల పరంపర ప్రారంభించారు. ఈ విషయం మహనీయ అబూ బక్ర్‌కు తెలిసి, ఆయన ఓ దళం అక్కడికి పంపారు. వీరు వెళ్లి తొలుత సనఆ ని వశపరచుకున్నారు. ఇస్లామ్ శత్రువుల్ని బందీలుగా తీసుకున్నారు. మరో తెగవారు కూడా తిరుగుబాటు సన్నాహాలు చేస్తున్నారని తెలిసి వారికీ సమయానికి బుద్ధి చెప్పడం జరిగింది. వారి నాయకుడు పట్టుబడ్డాడు.

ఈ విధంగా ప్రవక్త మహనీయుల (స) తరువాత తలెత్తిన అనేక సమస్యల్ని ధైర్యంగా, సాహసోపేతంగా, మరెంతో వివేకంగా, ఎదుర్కొని రాజ్యంలో శాంతి సుస్థాపితం చేయగలిగారు తొలి ఖలీఫా మహనీయ అబూ బక్ర్ (ర). ✤


గీటురాయి వారపత్రిక

**ముఖ్య ఆశయాలు**

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.


'చరితార్థులు'-2



# ముహమ్మద్ అబ్దుల్లా

(-1871)

27




మాతృభూమి విముక్తి పోరాటంలో పాల్గొంటున్న యోధులకు మరణదండన విధించిన ఆంగ్ల జడ్జిని అత్యంత సాహసోపేతంగా అంతం చేసిన వహాబీ వీరుడు ముహమ్మద్ అబ్దుల్లా ప్రస్తుత పాకిస్థాన్‌లోని పెషా వర్‌లో జన్మించారు. వహాబీల పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తియ్యాక అబ్దుల్లా కూడా వహాబీ ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యి నిబద్ధత గల వహాబీ కార్యకర్తగా రూపొం దారు. ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వహాబీలను అణిచివేసేందుకు ఆంగ్ల పాలకులు 'డిటెన్షన్ రెగ్యులేషన్ యాక్ట్ 1818' ను తెచ్చారు. ఈ చట్టాన్ని ఉపయోగించి ఉద్యమ కారులను అరెస్టు చేసి ఎటువంటి విచారణ లేకుండా హింసలకు గురిచేసారు. నామమాత్ర విచారణలు జరిపి ప్రవాస శిక్షలు విధించారు. చిత్రహింసలు, కాల్చివేతలు, ఉరిశిక్షలు, నిర్బంధాలు విముక్తి పోరాట యోధులకు సర్వసాధారణమయ్యాయి. ఈ క్రమంలో విముక్తి పోరాట యోధుల కోసం నిధులను సేకరిస్తున్న, సమ కూర్చుతున్న అమీర్ ఖాన్, హష్మత్ ఖాన్, ముబారక్ అలీ తదితరులను 1869 జూలైలో బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధించింది. ఆ నాయకులలో అమీర్ ఖాన్, హష్మత్ ఖాన్‌లు చిత్రహింసల కారణంగా మృతిచెందగా మరో ఐదుగురికి ఆజన్మ కారాగార శిక్షను విధించి ఆంగ్ల న్యాయస్థానం అండమాన్ దీవులకు పంపింది. ఈ కేసును కలకత్తా ఉన్నత న్యాయస్థానానికి అప్పీల్ చేసుకోగా జస్టిస్ నార్మన్ వివక్షాపూరితంగా వ్యవహరించి అప్పీలును కొట్టివేశాడు. ఆ నిర్ణయంతో ముహమ్మద్ అబ్దుల్లాలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. పరాయి పాలకుల తొత్తులైన అధికారుల మీద ప్రతీకార జ్వాల రగిలింది.



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

ఆంగ్ల జడ్జి నార్మన్‌ను హతం చేయడానికి ఆయన పథకం తయారు చేసుకున్నారు. 1871 సెప్టెంబర్ 20న కలకత్తా ఉన్నత న్యాయస్థానం వద్ద నార్మన్ కోసం ముహమ్మద్ అబ్దుల్లా ఎదురు చూస్తున్నారు. వలసపాలకుల దౌష్ట్యాన్ని ఎదుర్కొంటూ పోరాడుతున్న వహాబీ వీరుల శిక్షలను ఖాయపర్చిన జస్టిస్ నార్మన్ న్యాయస్థానం భవనం మెట్లు దిగుతూ అబ్దుల్లా కంటపడ్డారు. ఆలస్యం చేయకుండా జస్టిస్ నార్మన్ వెంటనున్న రక్షణ వలయాన్ని ఛేదించు కుని రివ్వున ముందుకెళ్ళి జస్టిస్ నార్మన్ మీద ఆకస్మిక దాడి చేసి క్షణాలలో ఆ ఆంగ్లేయుడిని అబ్దుల్లా తన కత్తి వేటుకు బలి చేశారు. ఆ తరువాత అక్కడే నిర్భయంగా నిల్చున్న అబ్దుల్లాను ఆంగ్ల ప్రభుత్వం పోలీసులు పట్టుకున్నారు. ఆయన మీద హత్యకేసు నమోదైంది. మాతృభూమి దాస్య విముక్తి కోసం పోరాడుతున్న ఉద్యమకారుల పట్ల వివక్షపూరితంగా వ్యవహరించిన విదేశీయుడ్ని హతం చేయటం తన విధిగా భావించినట్టు విచారణ సందర్భంగా అబ్దుల్లా నిర్భయంగా వెల్లడించారు. ప్రధాన లక్ష్యం నెరవేరినందున ఏ శిక్ష విధించినా తనకు ఎటువంటి చింత లేదని అబ్దుల్లా బహిరంగంగా ప్రకటించారు. ఆంగ్ల న్యాయస్థానం అబ్దుల్లాకు మరణదండన విధించింది. 1871 చివరకు అబ్దుల్లాకు విధించిన ఉరిశిక్షను అమలు చేశారు. అబ్దుల్లా భౌతికకాయాన్ని అంత్యక్రియల కోసం తమకు అప్పగించమని బంధువులు అర్థించినా, నిరాకరించిన ఆంగ్ల అధికారులు మత సంప్రదాయం ప్రకారంగా ఖననం చేయాల్సిన ముహమ్మద్ అబ్దుల్లా పార్థివ శరీరాన్ని అందుకు విరుద్ధంగా దహనం చేయించి ఆయన పట్ల తమలో గూడుకట్టుకున్న ద్వేషాన్ని వెల్లడి చేసుకున్నారు. ✤




# స్వాతంత్ర్య పోరాటంలో హిందూ ముస్లిం సఖ్యత

యండి. ఉస్మాన్ ఖాన్

**దేశ స్వాతంత్ర్యం కోసం** అనేకమంది యువ కిశోరాలు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారు. వారిలో రాంప్రసాద్ బిస్మిల్ , అష్ఫాఖుల్లా ఖాన్ లు ముఖ్యులు. వయసుకు మించిన పరిణితితో కేవలం ముప్పయ్యేళ్ళకే నూరేళ్ళ ఖ్యాతినార్జించి, దేశంకోసం ఉరితాడును ముద్దాడిన దేశ భక్తాగ్రేసరులు. ఆంగ్లేయులకు సింహస్వప్నాలై ముచ్చెమటలు పట్టించిన రాంప్రసాద్, అష్ఫాఖుల్లాలలో.. బిస్మిల్ 1897 జూన్ 11 వ తేదీన, అష్ఫాఖ్ 1900 అక్టోబర్ 22న ఉత్తర ప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో జన్మించారు. మూల్ మతి, మురళీధర్‌లు రాంప్రసాద్ తల్లిదండ్రులు. మజ్హరున్నీసా, షఫీఖుల్లాహ్ ఖాన్ అష్ఫాఖ్ తల్లిదండ్రులు. రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖ్ ల కుటుంబ నేపథ్యాలు ఉత్తర దక్షిణ ధృవాల్లాంటివి. రాంప్రసాద్ బిస్మిల్ సనాతన హిందువు, ఆర్యసమాజ సభ్యుడు. అష్ఫాఖ్ సాంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన స్వచ్ఛమైన ముస్లిం. భిన్న సామాజిక జీవన నేపథ్యాలనుండి వచ్చిన వీరి స్నేహం పాలూ పంచదారలా కల గలిసి పోయింది. అష్ఫాఖ్ ముస్లిం కావడంతో ఆర్య సమాజ సభ్యుడైన బిస్మిల్ మొదట్లో అతన్ని ఒక పట్టాన నమ్మలేదు, శంకించాడు. కాని అచంచలమైన అష్ఫాఖ్ దేశ భక్తికి, అంకిత భావానికి బిస్మిల్ చలించి పోయాడు. అనుమానించినందుకు తీవ్రంగా పశ్చాత్తాప పడ్డాడు. ఇద్దరి లక్ష్యం ఒకటే కావడంతో సనాతన హిందువైన రాంప్రసాద్ బిస్మిల్‌కు, సాంప్రదాయ ముస్లిం అయిన అష్ఫాఖ్‌కు గాఢమైన స్నేహబంధం ఏర్పడింది. ఒకే కంచంలో తిని ఒకే మంచంపై పడుకునేంతగా వారి స్నేహ బంధం పెనవేసుకు పోయింది. ఒకరికొకరు ప్రాణ సమానమై పొయ్యారు. ఎవరి ధర్మాలను వారు పాటిస్తూనే దేశం కోసం, ధర్మం కోసం ఒక్కటై భావి తరాలకు ఆదర్శంగా నిలిచి పొయ్యారు. ఇద్దరు యువకులూ భావుకులే. యుక్త వయసులోనే పదునైన కవిత్వం రాశారు. సామ్రాజ్య వాద భావజాలాన్ని తుత్తునియలు చేశారు. అచంచలమైన దేశభక్తితో బ్రిటీషోడి గుండెల్లో నిప్పు కణికలై రగిలారు. పర్వతంలా పాతుకు పోయిన

ఆంగ్లాధికారాన్ని తొడగొట్టి సవాల్ చేశారు. ఆర్థిక ఇబ్బందులు లేని కుటుంబాల్లో, చీకూ చింతా లేకుండా విలాసవంతంగా గడప వలసిన యవ్వన కాలంలో దేశం గురించి ఆలోచించం మామూలు విషయం కాదు. కాని వారు ఆ వయసులోనే దేశం కోసం ఆలోచించారు. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని కుటుంబ నేపథ్యాలైనా, వారి ఆలోచనలు రాజకీయంగానే సాగేవి. దీంతో ఎప్పుడెప్పుడు విప్లవోద్యమంలోకి దూకాలని ఉవ్విళ్ళూరేవారు. విదేశీ వస్తువుల వాడకం ఆంగ్లేయుల బానిసత్వానికి చిహ్నమని, వీటి వాడకం మానేయాలని ప్రచారమే ప్రారంభించారు. మాతృదేశంకోసం పోరాడి చరిత్రలో నిలిచి పోవాలని, దానికోసం తాము ఏమైపోయినా పరవాలేదని దృఢంగా నిర్ణయించుకున్నారు. ఉద్యమ అవసరాలకోసం కావలసిన ధనాన్ని ప్రభుత్వధనం కొల్లగొట్టడం ద్వారా సమకూర్చుకోవాలని నిర్ణయించారు. అందులో భాగంగా 1925 ఆగష్టు 9 వ తేదిన అష్ఫాఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి మరికొందరు విప్లవకారులు కలిసి కాకోరీ గ్రామం వద్ద ప్రభుత్వ ఖజానాతో వెళుతున్న రైలును దోపిడీ చేశారు. పట్టుమని పదిమంది కూడా లేని యువకులు ఏకంగా బ్రిటిష్ ఖజానాకే గురి పెట్టి, రైలునే దోచేయడం ఆంగ్లాధికారులకు తల తీసేసినంత పనైతే, ఉద్యమ కారులకు కొత్త ఉత్సాహాన్ని అందించినట్లయింది. దీంతో ఆంగ్లాధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని సోదాలు ముమ్మరం చేసి, సెప్టెంబరు 26 న రాంప్రసాద్ బిస్మిల్ ను అరెస్టుచేశారు. అష్ఫాఖ్ ఇంటిపై కూడా పోలీసులు దాడిచేశారు. కాని అష్ఫాఖ్ తప్పించుకున్నాడు. కొన్నాళ్ళపాటు బనారస్‌లో అజ్ఞాత జీవితం గడిపి ఢిల్లీ చేరుకున్నాడు. ఢిల్లీలో మిత్రుడు చేసిన నమ్మక ద్రోహంతో పోలీసులకు పట్టుబడ్డాడు. నయానా భయానా లొంగదీసుకొని మిగతా వారి సమాచారం రాబట్టాలని పోలీసులు ఎంత ప్రయత్నించినా అష్ఫాఖ్ ఏమాత్రం భయపడలేదు. చివరికి 1927 డిసెంబర్ 19 వ తేదీన అష్ఫాఖ్ ను, రాంప్రసాద్ బిస్మిల్ ను ఉరితీయాలని తీర్పు వెలువడింది. ప్రాణత్యాగానికి ఏనాడో సిద్ధపడ్డ ఈ ఇద్దరు ప్రాణ మిత్రులు మాతృదేశ విముక్తికోసం ఉరి కంబాన్నెక్కబోతున్నందుకు గర్వపడుతున్నామని సగర్వంగా ప్రకటించారు. ఇంతటి అదృష్టం అందరికీ దక్కదని, ఏడుకోట్ల (ఆనాటి) ముస్లిం జనాభాలో దేశంకోసం బలిపీఠమెక్కబోతున్న తొలి ముస్లింను తానే అయినందుకు సంతోషంతో పొంగిపోతున్నాని అష్ఫాఖ్ గర్వంగా ప్రకటించాడు. ఉరితాడును పూమాలగా స్వీకరించి, 'నా మాతృదేశమా... సదా నీసేవ చేస్తూనే ఉంటా... ఉరి శిక్షయినా, యావజ్జీవమైనా... సంకెళ్ళ దరువుతో నీ కీర్తిగానం చేస్తూనే ఉంటా.' అని కవితాత్మకంగా తన దేశభక్తిని చాటుకున్నాడు. 'కుఛ్ ఆర్జూ నహీ.., హయ్ తొ బస్ ఇత్ ని.., రఖ్ దె కోయీ ఖాకె వతన్ మేరె కఫన్ మే..' అంటూ దేశం పట్ల, తను పుట్టిన భూమి పట్ల తన అచంచలనైన ప్రేమాభిమానాలను వ్యక్తం చేశాడు. ఆరోజు రానే వచ్చింది. ప్రాతఃకాల ప్రకృతి మాత ఈతంతంగాన్నంతా చేష్టలుడిగి చూస్తూఉండి పోయింది. అమరజీవులు అష్ఫాఖుల్లా, రాంప్రసాద్ బిస్మిల్ ల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పొయ్యాయి. ఇద్దరినీ వేర్వేరు జైళ్ళలో ఒకేరోజు ఉరి తీశారు. భూప్రపంచం ఉన్నంత వరకు దేశం పట్ల బాధ్యతను గుర్తుచేస్తూ అష్ఫాఖ్ , బిస్మిల్ ల త్యాగం, స్నేహం సజీవంగా ఉంటుంది. హిందూ ముస్లిం ఐక్యతను చాటుతూ.. మతోన్మాదులకు సవాల్ విసురుతూనే ఉంటుంది. మతాభిమానం, మత దురహంకారం మధ్య తేడాను తెలుపుతూ, మతం4o654o65కాదు, మానవత ముఖ్యం అన్న సత్యాన్ని, సామరస్య సందేశాన్ని వినిపిస్తూనే ఉంటుంది. ✤


## చందాదారులకు విజ్ఞప్తి

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

(గత సంచిక తరువాయి)

# ఆత్మ శుద్ధి

**మూలం : రజీయుల్ ఇస్లాం నద్వీ**
**అనువాదం : ముంతాజ్ బేగం**

## కాపట్య రోగం

కాఠిన్యం అంటే కరకుదనం. రోగం ఉన్న మనసుపై ఎలాంటి బోధ పని చేయదు. ఏ హెచ్చరికా పనిచేయదు. మనిషి పూర్తిగా షైతాన్ పంజాలో చిక్కుకుపోతాడు. షైతాన్ సూచించిన పనులనే చేస్తాడు. కఠిన హృదయం గురించి ఖుర్‌ఆన్‌లో ఇటువంటి ఉదాహరణలు ఇవ్వబడ్డాయి. "వారి హృదయాలు కఠినం చేయబడ్డాయి. ఇక వారి పరిస్థితి ఎలాగుందంటే పదాలను తారుమారు చేసి ఆ విషయాన్ని ఎటో తీసుకువెళ్ళి మార్చివేస్తారు".

సూరె అన్‌ఆమ్‌లో మా వైపు నుండి వారిలో కాఠిన్యం వస్తే వారు నమ్రతను ఎందుకు స్వీకరించలేదు? వారి హృదయాలు మరింత కఠినంగా మారిపోయాయి. షైతాన్ వారిని 'మీరు చేసేదంతా మంచిదే అని సాంత్వన పరిచాడు' సూరె హదీద్‌లో 'మీరు వారి వల్లే పూర్వం గ్రంథం ఒసగబడినవారి వలే ఐపోకండి. ఒక దీర్ఘ సమయం గడిచిపోయాక వారి హృదయాలు కఠినమైపోయాయి. వారిలో ఈ రోజు చాలా మంది అవిధేయులైపోయారు.

## మనసులో కుటిలత్వం

మనసులో కుటిలత్వం ఇంకా పెరిగిపోయింది. ఇక మనిషి ఉపద్రవం లేవదీస్తాడు. దైవాజ్ఞలకు విరుద్ధంగా తలా తోక లేని విషయాలు లేవదీస్తాడు. ఆలి ఇమ్రాన్‌లో చెప్పబడిన దాని ప్రకారం అల్లాహ్ ఎవరి హృదయాలలో వక్రత్వం ఉందో వారు ఉపద్రవాలను వెదుకుతూ అస్పష్టమైన వాటి వెనుకాల పడతాడు. వాటికి వక్రభాష్యం చెప్పటానికి ప్రయత్నం చేస్తారు. ఫలితంగా వారి హృదయాలపై పరదా పడిపోతుంది. ఇక ఏ విషయమూ వారికి అర్థం అవదు. ఏ ఆజ్ఞను అనుసరించటానికీ మనసొప్పదు. అల్లాహ్ అన్‌ఆమ్‌లో "మేము వారి హృదయాలను తెరతో కప్పి వుంచాము. వాటి వలన వారు ఏమి అర్థం చేసుకోలేరు. వారి చెవులలో సీసం పోశాము. అంతా విని కూడా ఏమీ అర్థం చేసుకోలేరు. ఏదైనా జ్ఞాపికను చూసి కూడా దానిని విశ్వసించరు" అని అనబడింది.

సూరె బఖరాలో "మా హృదయాలు సురక్షితంగా ఉన్నాయని వారు అంటారు. అసలు విషయం ఏమిటంటే వారి తిరస్కార వైఖరి వల్ల వారిపై అల్లాహ్ తిరస్కారం పడింది. అందుకని వారు తక్కువగానే విశ్వసిస్తారు" అని సెలవీయబడింది.

## ప్రక్షాళనకు ఉపాయాలు

ఖుర్‌ఆన్, హదీసులలో హృదయానికి పట్టే రుగ్మతలు, దుర్లక్షణాల గురించి వివరిస్తూ కొన్ని సూచనలు చేయబడ్డాయి. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ గారు మహాప్రవక్త(స) గారు ఇలా సెలవిచ్చినట్లు వివరించారు "ఇనుప వస్తువుకు తుప్పు పట్టినట్లే హృదయానికి కూడా తుప్పు పడుతుంది. ఇనుముకి నిప్పు తగిలితే అది తుప్పు పట్టిపోతుంది. ఇనుములో దృఢత్వం, పటిష్టత ఉంటాయి" ఎంత చక్కని సామ్యం!

బనీ ఇస్రాయీల్ ఆకాశ హర్మ్యాలు ఇనుముతోనే నిలిచి ఉంటాయి. కానీ ఇనుముకి తుప్పు పడితే దానికి ఎటువంటి విలువా ఉండదు. ఇనుము ఆధారంగా నిలిచిన భవంతులు పేకమేడల్లా కూలిపోతాయి. ఇదే పరిస్థితి హృదయానిది. వివిధ మానసిక, నైతిక రుగ్మతలు తుప్పు లాగా మనసులో ఆవహిస్తే మనసు వినాశనానికి గురవుతుంది. ఇక అల్లాహ్ సాన్నిధ్యంలో ఆ మనసుకు ఎటువంటి విలువ ఉండదు. ఈ హదీసులో సహాబా మహాప్రవక్త గారిని ప్రశ్నించారు. హృదయాలకు పట్టిన తుప్పును ఎలా వదిలిస్తారు అని. దానికి ఆయన మరణాన్ని తరచూ స్మరించాలి అని ఉపదేశించారు.

ఖుర్‌ఆన్‌ని ఎప్పుడూ చదువుతూ ఉండాలి (బైహఖీ). ఈ హదీసును ఎప్పుడూ మీ దృష్టిలో వుంచుకుని దానివల్ల గుణపాఠం నేర్చుకోవాలి. మరణానికి మించిన ఉపదేశం ఏదీ లేదు (నిశ్శబ్ద ఉపదేశం). ఏ వ్యక్తి ఎంత జీవిత వ్యవధి పొంది వచ్చాడో తెలియదు. పరీక్షా పత్రం ఎప్పుడు చేతి నుండి లాక్కోబడుతుందో తెలియదు. ఫలితం వినిపించడానికి అల్లాహ్ సన్నిధిలో ఎంత సేపు నిలబడాలో తెలియదు. మరుక్షణం ఏమి జరుగుతుందో అతని మరణం ఎక్కడ సంభవిస్తుందో తెలియదు. సూరె లుఖ్మాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు : "తాను రేపటి రోజున ఏమి సంపాదించనున్నదో ఏ ప్రాణీ ఎరుగదు." (31: 34)

## మరణాన్ని స్మరించడం

మరణాన్ని ఎక్కువగా స్మరించడం, తమ చుట్టుపక్కల వారి చావును చూసి గుణపాఠం నేర్చుకోవటం, తమ పర్యవసానాన్ని గురించి ఆలోచించడం వల్ల హృదయ క్షాళన జరుగుతుంది. అతని బలహీనతలు దూరమైపోతాయి. మరొక హదీసులో

“ఖుర్‌ఆన్‌ని పఠించాలి, హృదయాల రోగానికి ఇది స్వస్థత” అనబడింది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు : బనీ ఇస్రాయీల్‌లో మేము ఈ ఖుర్‌ఆన్ క్రమంగా విశ్వసించేవారి హృదయాలకు స్వస్థత, కారుణ్యాన్ని ప్రసాదించాము. ఖుర్‌ఆన్ శ్రేయో వృద్ధికి మార్గం దాని వలన మనిషి అల్లాహ్ కారుణ్యానికి హక్కుదారు డవుతాడు. ఖుర్‌ఆన్ ఒక జ్యోతి. దానివల్ల చీకట్లు తొలగిపోతాయి. సన్మార్గం బోధపడుతుంది.

ఖుర్‌ఆన్‌తో సంబంధం వృద్ధికి సౌభాగ్యానికి సోపానం. దానితో సంబంధం తెగిపోవటమంటే వినాశానికి పతనానికి తొలిమెట్టు. అల్లాహ్ తన గ్రంథంలో కొందరికి ఔన్నత్యం ప్రసాదిస్తానని, కొందరిని పతనం వైపునకు తోసివేస్తాను అని అన్నాడు. ఎక్కువగా పఠించబడే పుస్తకం ఖుర్‌ఆన్. అలాగే చాలామంది అర్థం చేసు కోకుండా ఎక్కువగా చదివే పుస్తకం ఖురానే అనేది ఒక చేదు వాస్తవం. ఈ ఖుర్‌ఆన్ ఒక సన్మార్గ దర్శకత్వం మనిషి తన కష్టాలకు, కడగండ్లకు పరిష్కారం వెతుక్కునే గైడ్ బుక్ లాంటిది. దాన్ని అర్థం చేసుకోకుండా పఠిస్తే లాభం ఎలా చేకూరుతుంది.

ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకుని చదవమని ఆజ్ఞాపించబడింది. దానిపై చింతన చేయాలని ఉపదేశించబడింది. సూరె ముహమ్మద్‌లో, వారు ఖుర్‌ఆన్‌ను గురించి ఆలోచించలేదా? లేక వారి హృదయాలపైన తాళాలు పడివున్నాయా? అని ప్రశ్నిస్తున్నాడు. (47: 24)

## మన్నింపు

హృదయాల మలినత్వం దూరమై బలహీనతల్ని దూరం చేయటానికి తౌబా, మన్నింపుల వైఖరి రెండవ మార్గం. మనలో తమ పాతి వ్రత్యంపై రొమ్ము విరుచుకునేవారెవరైనా ఉన్నారా? మనవల్ల చిన్నా పెద్దా తప్పులు పొరపాట్లు దొర్లకుండా ఉన్న వారెవరైనా ఉన్నారా. పాపం, పొరపాట్లు, బలహీనత, నేరం వల్ల మనస్సు పంకిలం అయిపోతుంది. పశ్చాత్తాపం, మరలటం అనేది ఆ పంకిలాన్ని శుభ్రం చేస్తాయి.

మహాప్రవక్త(స) గారు వివరించినట్లు హజ్రత్ అనస్ బిన్ మాలిక్ గారు వివరిస్తున్నారు. ఇబ్నెమాజాలోని హదీసు : ‘చాలామంది చాలా తప్పులు చేస్తుంటారు. ఆ తప్పులు చేసే చాలామందిలో ఎక్కువగా అల్లాహ్ వైపు మరలేవారు ఉత్తములు’

తౌబా, మరలింపు వైఖరి వల్ల ఆంతర్యాల క్షాళన జరుగుతుంది. హజ్రత్ అబూ హురైరా గారి ఉల్లేఖనం ప్రకారం ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు : “విశ్వాసి ఏదైనా తప్పు చేస్తే అతని హృదయంలో ఒక నల్లటి చార ఏర్పడుతుంది. ఒకవేళ అతడు పశ్చాత్తాపపడి ఆ పని నుండి వేరుపడి అల్లాహ్‌తో మన్నింపు కోరుకుంటే అతని హృదయం నిర్మలంగా మచ్చలేకుండా అయిపోతుంది. కాని ఒకవేళ ఈ నల్లని చార పెరుగుతూ పోతూ ఉంటే అది పూర్తి హృదయాన్ని ఆవహిస్తుంది. ఆ తుప్పు గురించి అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించాడు.

“ఎంత మాత్రం కాదు. వాస్తవానికి వారి హృదయాలకు వారి దుష్కర్మ ఫలితంగా తుప్పు పట్టింది”.

ఒక హదీసులో ప్రవక్త గారు ఇలా సెలవిస్తున్నారు: “నా హృదయంపై కూడా మాలిన్యం వచ్చేస్తుంటుంది. నేను అల్లాహ్‌ను రోజుకు 100సార్లు మన్నింపు కోరుతాను”.

హృదయాలను పవిత్ర చేకూర్చే మూడో వస్తువు అమితంగా వేడుకోలు చేసుకోవడం. దుఆ మూలంగా దాసుడికి అల్లాహ్‌తో సామీప్యం ఏర్పడుతుంది. ఆరాధన సారం వేడుకోలే (అద్దుఆవు ముఖ్ఖుల్ ఇబాదా). దాని ఫలితంగా దాసుడిని అల్లాహ్ కారుణ్యం కప్పివేస్తుంది. దుఆ అనేది దేవుని పరిపూర్ణ దైవత్వాన్ని, దాసుని ఆత్మ సమర్పణా భావాన్ని తెలియజేస్తుంది. హదీసులో ఈ విధంగా దుఆలు ప్రస్తావించబడ్డాయి.

**దుఆ** : ఒక సహాబీ, ఓ దైవప్రవక్తా, నాకు ఏదైనా దుఆ నేర్పించండి అని అడిగారు. ఆయన నాకు నేర్పిన దుఆలో “ఓ ప్రభువా! నా హృదయాన్ని (దాడుల నుండి) చెడుల నుండి కాపాడేందుకు నేను రక్షణ కోరుతున్నాను’ ఒక హదీసులో ఆయన ఈ దుఆ ప్రస్తావించబడింది (2654 : ముస్లిం) “ఓ అల్లాహ్! హృదయాలను మరల్చే ప్రభువా! మా హృదయాలను నీ అనుసరణ వైపు మరల్చు.’

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్, మహాప్రవక్త గారు ఇలా వేడుకునే వారని చెప్పారు “ఓ అల్లాహ్ నీవు నన్ను అమితంగా సంతృప్తి చెందేవానిగా, అమితంగా స్మరణ చేసేవానిగా, అతిగా భయపడే వానిగా, అమితంగా ఆరాధించేవానిగా, అమితంగా నీవైపు మరలే వానిగా, సున్నిత హృదయం కలవానిగా అమితంగా మరలేవానిగా చేయి”

“ఓ అల్లాహ్ నా మన్నింపుని అంగీకరించు, నా పాపాలను కడిగి వేయి. నా మొరను ఆలకించు. నా వాదనను పటిష్టపరచు, నా జిహ్వాను సరిచేయి. నా మనసుకు (సలామత్) శ్రేయోభిలాషిగా చేయి, నా హృదయంలోని వక్రతను దూరం చేయి” అని వేడుకునే వారు. మహాప్రవక్త ఈ దుఆ చేసేవారని విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(రజి) ఉల్లేఖించారు. (బుఖారీ, 6328), (ముస్లిం : 581)

“ఓ అల్లాహ్ నేను నీ శరణు కోరుతున్నాను. సోమరి తనం నుండి, నిస్సహాయమైన వార్ధక్యం నుండి, పాపాల నుండి, అప్పుల భారం నుండి. నీవు నా హృదయాన్ని తెల్ల వస్త్రాన్ని మురికి నుండి శుభ్రం చేసినట్లుగా పాపాల నుండి పరిశుభ్రంగా చేయి. నాకు-నా తప్పులకు మధ్య తూర్పు పడమరలకున్నంత దూరాన్ని వుంచు.”




**2024 లోక్‌సభ** ఎన్నికలకు ప్రీ ఫైనల్‌గా భావించిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో మరోసారి కాంగ్రెస్ చతికిలబడింది. ఛత్తీస్‌గఢ్ ఫలితమైతే అనూహ్యం. రాజస్థాన్‌లో కాంగ్రెస్ నాణ్యమైన పరిపాలన అందజేసినప్పటికీ అంతర్గత కుమ్ములాటల కారణంగా పరాజయాన్ని మూటకట్టుకుంది. మధ్యప్రదేశ్‌లో ఇప్పటివరకు కాంగ్రెస్ కోలుకోలేదు. ఎటొచ్చీ ఆ పార్టీకి ఊరట కలిగించిన రాష్ట్రం ఒక్క తెలంగాణ మాత్రమే.

## స్పష్టమైన మెజారిటీ

తెలంగాణలో కాంగ్రెస్‌కు లభించినది అఖండ విజయం కాక పోవచ్చు. కాని స్పష్టమైన మెజారిటీ రావడం దానికి శుభసూచకం. మరో ఆరేడు సీట్లు తగ్గినా రాజకీయం రసకందాయంలో పడేది. ఒకవైపు నుండి భాజపా, మరోవైపు నుండి మజ్లిస్ బీఆర్ఎస్‌ను నిలుపుకోవడానికి సిద్ధమై ఉన్నాయి డిసెంబర్ 3వ తేదీ ఉదయం వరకు. అయితే ఆయారాం గయారాంల బేరసారాలకు, గోడ మీది పిల్లుల అవకాశవాదానికి తావులేకుండా కాంగ్రెస్ గట్టెక్కడం మంచి పరిణామం అని చెప్పాలి. ఈ వ్యాసం వ్రాసే సమయానికి రేవంత్‌రెడ్డిని సీఎల్‌పీ తాత్సారం చేయకుండా రాష్ట్ర చీఫ్ మినిస్టర్‌గా ఎన్నుకుని, విజ్ఞతను ప్రదర్శించింది. దానికి పార్టీ అధిష్టానం ఆమోదం కూడా లభించింది. డిసెంబర్ 7వ తేదీన రేవంత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. తెలంగాణ ఆవిర్భవించిన తొమ్మిదిన్నరేండ్ల తరువాత ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు అధికారం లభించింది.

39 స్థానాలకు పరిమితమైన బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిజాయితీగా తమ ఓటమికి గల కారణాలను సమీక్షించుకోవాలి. తెలంగాణ రాష్ట్ర సాధనకై సర్వం తానై నిలబడిన కేసీఆర్‌కు ఈ ఎన్నికలు గుణపాఠం కావాలి. ఆయన ఫాం హౌస్‌లో కూర్చుని ఆత్మావలోకనం చేసుకుంటారో లేదో ఆయన ఇష్టం. మొత్తానికి ఆత్మ పరిశీలన, పార్టీ ప్రక్షాళన మాత్రం అవసరం.

## ఓటమికి గల కారణాలు

2014 నాటికి కేసీఆర్ తెలంగాణలో ఎదురులేని నాయకుడుగా ఎదిగిన విషయం వాస్తవం. ఆ పాపులారిటీతోనే ఆయన తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి అయ్యారు. 2014 నుండి 2018 వరకు ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారు. విద్యుత్ సరఫరాను మెరుగు పరిచారు. 'మిషన్ భగీరథ' పథకం ద్వారా జిల్లాల ప్రజలకు మంచినీటి సరఫరా విజయవంతంగా చేయించారు. సాగునీటి పథకంలో కూడా సక్సెస్ అయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకై కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నాయిని నర్సింహారెడ్డి హెూం మినిస్టర్‌గా ఉన్న కాలంలో

నగరంలో కొత్త ఇన్నోవా కార్లను పోలీసులకు ఇచ్చి పెట్రోలింగ్ వ్యవస్థను మెరుగుపరిచారు. శిథిలావస్థలో ఉన్న పోలీస్ స్టేషన్లను కూల్చివేసి అధునాతన సౌకర్యాలతో నూతన భవనాలు నిర్మించారు. ఎక్కడ అశాంతి, అలజడులు జరిగినా ఆదిలోనే చర్యలు గైకొని లా అండ్ ఆర్డర్‌ను కాపాడారు. ఈ కారణంగానే ప్రజలు 2018లో ఆయనకు మరోసారి నీరాజనం పట్టారు. తొమ్మిదన్నర సంవత్సరాల కాలంలో హైదరాబాద్ మహానగరంలో మత కలహాలు జరగకపోవటం కేసీఆర్ పరిపాలనా దక్షతకు నిదర్శనం అనటంలో ఎలాంటి సందేహం లేదు.

## గాడి తప్పింది

కాని అవినీతి రహితమైన పరిపాలనను అందిస్తానని చెప్పిన టీఆర్ఎస్ పరిపాలనా కాలంలో క్రమక్రమంగా అవినీతి పెరగ సాగింది. దానికితోడు నిరుద్యోగ సమస్యను పరిష్కరించే విషయంలో కూడా కేసీఆర్ విఫలమయ్యారు. బిఎడ్, డిఎడ్‌లో ఉత్తీర్ణులైన టీచర్ల నియామకాల్లో క్షంతవ్యం కాని తాత్సారం జరిగింది. కాంట్రాక్ట్ బేసిస్‌పై నియుక్తులైన లెక్చరర్లను రెగ్యులర్ చేయలేదు. పైగా కోవిడ్ కాలంలో వారికి జీతాలు అందలేదు. కాంట్రాక్ట్ ప్రాతిపదికపై నియుక్తులైన డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ పరిస్థితి ఐదేండ్లుగా సందిగ్ధావస్థలో ఉంది. గాంధీ మెడికల్ హాస్పిటల్‌తో సహా పలుచోట్ల నర్సులు నిరాహారదీక్షకు దిగారు. ప్రభుత్వోద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని దయనీయ స్థితి ఏర్పడింది. మిగులు బడ్జెట్ ఉన్న సర్కారు కాస్తా లోటు బడ్జెట్ సర్కారుగా మారిపోయింది. భారం తడిసి మోపెడన్నట్లు ప్రభుత్వం ముందు చూపు లేకుండా దళిత బంధు, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టి తూతూమంత్రంగా మాత్రమే ముగించింది. ఒక ఊరిలో 100 దళిత కుటుంబాలుండగా వారిలో 10శాతం కుటుంబాలకు మాత్రమే లబ్ధి చేకూరినప్పుడు మిగిలిన వారంతా అసంతృప్తికి గురవటం సహజం కదా! రైతుబంధు పథకం ద్వారా ఉన్నవాళ్ళు బాగుపడ్డారే తప్ప అసలుసిసలు హక్కుదారులకు 'హక్కు' లభించలేదు.

రోడ్ల నిర్మాణంలో కూడా తెలంగాణ ప్రాంతాలన్నింటికీ న్యాయం జరగలేదు. మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల గ్రామాలలో కళ్ళు చెదిరే రోడ్లు వేయించిన ప్రభుత్వం దక్షిణ తెలంగాణ గ్రామాలను ఎందుచేతనో ఉపేక్షించింది. మహాదేవ్‌పూర్, భూపాలపల్లి ప్రాంతాల నుండి ఇసుక లారీలు నగరాలకు క్యూ కట్టిన సంగతి వాస్తవం. కాని ఆ ఇసుకను తరలించటంలో అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విధంగా కేసీఆర్ పరిపాలన కుటుంబ పరిపాలనగా పేరు మోసింది. అయినవారికి ఆకుల్లో పెట్టి కానివారికి కంచెంలో కూడా పెట్టని వారుగా ఆ పార్టీ నాయకులు కీర్తి గడించారు.

కేసీఆర్ మాటల మాంత్రికుడే. స్థితప్రజ్ఞత కల నాయకుడే. సందర్భోచితంగా ఆయన నోట వెలువడే మాటల తూటాలతో ప్రత్యర్థులకు దిమ్మ తిరిగినంత పనయ్యేది. కాని రానురాను ఈ వాగ్ధాటియే ఆయన్ని గర్విష్టిగా మార్చింది. ఎదుటివారికి తమ మనోభావాన్ని వ్యక్తం చేసే అవకాశం లేకుండా చేశారు. కేబినెట్ సమావేశాలు జరిపినా, కలెక్టర్ల మీటింగ్‌లు పెట్టినా ఎవరినీ నోరు మెదపనివ్వలేదు. ఎవరయినా ఏదయినా చెప్పబోతే కించపరిచే విధంగా కూర్చోబెట్టేవారు. ఈ అహంకారమే ఆయన్ని దెబ్బ తీసింది.

దానికితోడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారు రాష్ట్ర సమస్యలపై దృష్టిని కేంద్రీకరించకుండా జాతీయ రాజకీయాలపై మోజు పెంచుకుని పెద్ద తప్పు చేశారు. ఒకప్పటి ఆయన రాజకీయ గురువు అయిన ఎన్టీ రామారావుకు 1989లో ఎదురైన పరాజయం నుండైనా ఆయన పాఠం నేర్చుకోలేదనిపిస్తోంది. తెలుగుదేశాన్ని కాస్తా 'భారతదేశం'గా మార్చజూసిన దివంగత ఎన్టీరామారావుకు రాష్ట్ర ప్రజలు ఎలా గుణపాఠం నేర్పారో తెలియనిది కాదు. ఎంతయినా 'హ్యూమన్ మెమరీ ఈజ్ టూ షార్ట్'.

## కాంగ్రెస్ విజయం వెనుక

మొన్నటిదాకా తెలంగాణలో జీవచ్ఛవంలా ఉన్న కాంగ్రెస్‌కు కర్ణాటక ఎన్నికల ఫలితాలు టానిక్కులాగా పనిచేశాయి. పిసిసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌కు ఊపిరిలూదారు. పార్టీని వరిష్ఠ నేతల ఉచ్చులో నుండి విడిపించి కొత్త తరహాలో పని చేశారు. ప్రజల్లో దూసుకుపోయారు. కేసీఆర్ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను క్యాష్ చేసుకోవటంలో చాలావరకు సఫలీకృతుల య్యారు. ఆయన కష్టానికి తగ్గ ఫలితం వచ్చింది.

"మేము పాలకులంగా కాదు, సేవకులుగా పనిచేయాల్సి ఉంది" అన్న రేవంత్‌రెడ్డి మాటలు స్వాగతించదగినవి. ఆ మాటను ఆయన నిలబెట్టుకోవాలి. ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలను నెరవేర్చాలి. ముఖ్యంగా 'లా అండ్ ఆర్డర్' వ్యవహారంలో కాంగ్రెస్‌కు మంచి పేరు లేదు. రాష్ట్రం ప్రగతి పథాన సాగిపోవాలంటే శాంతి, సామరస్యం, సౌహార్దం చాలా అవసరం. అహంకారానికి, ప్రతీకారేచ్ఛకు తావీయకుండా వినమ్రతతో నాణ్యమైన పరిపాలనపై దృష్టిని కేంద్రీకరించాలి. గతం నుండి గుణపాఠం నేర్చుకోవాలి. లేకపోతే ఈ రోజు బిఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే రేపు తెలంగాణలో కాంగ్రెస్‌కూ పట్టవచ్చు. తెలంగాణ ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు. ఈనాడు రేవంత్‌రెడ్డి అందలం ఎక్కబోతున్నారు. ఆయన ప్రజలకు అందకుండా పోరాదని కోరుకుందాం.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

24–26 వీరేమని అంటున్నారు, ఈ వ్యక్తి అల్లాహ్‌పైన అపనింద మోపుతున్నాడని అంటున్నారా?[43] అల్లాహ్ కోరుకుంటే నీ హృదయాన్ని మూసి ముద్ర వేసేవాడు.[44] ఆయన మిథ్యను సమసిపోయేలా చేస్తాడు, సత్యాన్ని తన ఆదేశాల ద్వారా నిజం చేసి చూపిస్తాడు.[45] ఆయన ఆంతర్యాల్లో దాగి ఉన్న రహస్యాలను ఎరిగినవాడు.[46] ఆయనే తన దాసుల పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు, దోషాలను మన్నిస్తాడు, నిజానికి మీ అందరి చేష్టలన్నింటిని గురించి ఆయనకు తెలుసు.[47] విశ్వసించేవారు, సదాచారవర్తనులు చేసే ప్రార్థనను ఆయన స్వీకరిస్తాడు, తన అనుగ్రహంతో వారికి మరింత అధికంగా ప్రసాదిస్తాడు. పోతే తిరస్కరించేవారికయితే బాధాకరమయిన శిక్ష ఎలాగూ ఉంది.

43. ఈ ప్రశ్నార్థకమయిన వాక్యంలో తీవ్రమయిన అధిక్షేపణ గోచరిస్తోంది. భావమేమిటంటే, ప్రవక్తా, ఈ జనులు ఈ స్థాయికి దుస్సాహసులయి బరితెగించారా, నీ వంటి వ్యక్తి పట్ల అబద్ధాల కల్పన, అదీ దైవం పట్ల అబద్ధం ఆపాదించినటు వంటి హేయమయిన నింద మోపుతూ వారికి ఏమాత్రం లజ్జ కలగడలేదా? వీరు నీ మీద అపనింద మోపి, నీవు స్వయంగా ఈ ఖుర్ఆన్‌ని రచియించి దాన్ని అబద్ధంగా, అవాస్తవంగా అల్లాహ్ పేరిట ఆపాదిస్తున్నావని అంటారా?

44. అంటే, ఇంతపెద్ద అసత్యం, కేవలం హృదయాలపైన మూతబడి, ముద్రపడ్డ వారే పలకగలరు. అల్లాహ్ అనుకుంటే నిన్ను సయితం వారిలో చేర్చేవాడే కాని ఇది ఆయన అనుగ్రహం, నిన్ను ఆ వర్గానికి దూరంగా పెట్టాడు. ఈ సమాధానంలో, ప్రవక్త మహనీయుల (స)పైన నిందలు మోపే వారి పట్ల తీవ్రమయిన వ్యంగ్యోక్తి దాగి ఉంది. భావమేమి టంటే, ప్రవక్తా వీరు నిన్ను కూడా తమ వంటి వ్యక్తిగానే పరిగణించారు. ఏ విధంగానయితే వీరు తమ స్వార్థ ప్రయోజ నాల కొరకు ఎంతటి పెద్ద అబద్ధాన్నయినా పలకడానికి వెరువరో నీవు కూడా నీ వ్యాపారానికి మెరుగులు దిద్దడానికి ఒక అబద్ధాన్ని సృష్టించావని భావిస్తున్నారు. కాని ఇది అల్లాహ్ అనుగ్రహం, ఆయన నీ హృదయంపైన, వీరి హృదయాలకు వేసిన మూత, ముద్ర వేయలేదు.

45. అంటే, ఇది అల్లాహ్ సంప్రదాయం. ఆయన మిథ్యకు ఎన్నడూ స్థిరత్వాన్ని ప్రసాదించడు. కడకు సత్యాన్ని సత్యంగానే నిరూపించి చూపిస్తాడు. అందువల్ల ప్రవక్తా నీవు ఈ అపనింద లను ఏమాత్రం ఖాతరు చేయకు, నీ పనేదో నీవు చేసుకుంటూ ముందుకు సాగు. ఒక సమయం రానుంది, అప్పుడు ఈ అబద్ధమంతా ధూళిలా ఎగిరిపోతుంది. నీవు అందజేస్తున్న సందేశం సత్యమయినదన్న విషయం బాహాటంగా ముందుకు వచ్చేస్తుంది.

46. అంటే, ఆయనకు తెలుసు ఈ అపనిందలు నీపై ఎందుకు మోపుతున్నారో. నిన్ను కించపరచడానికి జరుగుతున్న ఈ కృషి యావత్తుకు వెనక వాస్తవానికి ఎటువంటి స్వార్థప్రయోజనాలు, ఎటువంటి సంకల్పాలు పనిచేస్తున్నాయో ఆయన బాగా ఎరుగు.

47. వెనుకటి ఆయత్ వెనువెంటనే తౌబా (పశ్చాత్తాపంతో దైవం వైపునకు మరలడం) చేసే ప్రేరణ కలిగించడం ద్వారా దానంతట అదే వ్యక్తమయ్యే భావం, దుర్మార్గులారా, సత్య ప్రవక్తపైన అబద్ధపు ఆరోపణలు చేస్తూ మిమ్మల్ని మీరు మరింత దైవాగ్రహానికి పాత్రులుగా ఎందుకు చేసుకుంటారు, ఇప్పటికయినా మించిపోయిందేమీ లేదు, మీరు దుశ్చేష్టలను మానుకోండి. తౌబా చేసుకోండి. అల్లాహ్ మిమ్మల్ని మన్ని స్తాడు. తౌబాకు ఉద్దేశం ఏమిటంటే మనిషి తాను చేసినదానికి సిగ్గిల్లి తాను చేసిన, లేదా చేస్తూ ఉన్న చేష్టలను మానుకోవాలి, ముమ్ముందు దానికి మళ్ళీ పాల్పడరాదు. నిజమయిన తౌబాకు తప్పనిసరి ఆవశ్యకత ఏమిటంటే ఒక వ్యక్తి మునుపు ఏ తప్పు చేశాడో దాన్ని సరిదిద్దడానికి, దానికి ప్రతిగా పరిహారం చెల్లించడానికి అతను తన వంతుగా వీలయినంత మేర కృషి చేయాలి. మరెక్కడయితే పరిహారానికి అవకాశం లేదో అల్లాహ్‌ను క్షమాభిక్ష అర్థించి ఇతోధికంగా సత్కార్యాలాచరించి తాను తనపై వేసుకున్న ఆ మచ్చను ప్రక్షాళిస్తూ ఉండాలి. కాని తౌబా ఎన్నటికయినా అల్లాహ్ ప్రసన్నతను బడయ టానికి ఆ సంకల్పంతో చేయనిదే అది నిజమయిన తౌబా కాజాలదు. మరే కారణంగానయినా మరే ఉద్దేశంతోనయినా ఏదయినా దుశ్చేష్టను వదలివేయడం అసలు తౌబా నిర్వచనా నికి ఎంత మాత్రం సరిపోదు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

**340)** ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ ఖియార్ తెలిపారు: మిస్వర్ బిన్ మఖ్రమా, అబ్దుర్రహ్మాన్ బిన్ అస్వద్‌లిద్దరూ తనతో, 'నీవు హజ్రత్ ఉస్మాన్(రజి)తో అతని సోదరుడు వలీద్ వివాదం గురించి ఎందుకు మాట్లాడవు? ప్రజలు అతని పట్ల అసంతృప్తితో ఉన్నారు కదా!' అని చెప్పారు. అందువల్ల నేను మహనీయ ఉస్మాన్ (రజి) దగ్గరకు వెళ్ళాను. ఆ సమయంలో ఉస్మాన్(రజి) నమాజ్ కొరకు బయటకు వచ్చారు. నేను ఆయన్ని ఉద్దేశించి, 'మీతో నాకు అవసరం ఏర్పడింది. అందులో మీ శ్రేయం ఉంది' అని చెప్పాను. దానికి ఆయన "భలేవాడివే (నీ విషయంలో నేను అల్లాహ్ శరణు వేడుతున్నాను)" అన్నారు- 'నేను నీ నుండి అల్లాహ్ శరణు వేడుతున్నాను' అనే వాక్యాన్ని బహుశా మా'మర్ ఉల్లేఖించి ఉంటారని ఇమామ్ బుఖారీ (రహ్మ) అభిప్రాయపడ్డారు. అందువల్ల నేను వాళ్ళ దగ్గరకు తిరిగి వచ్చేశాను. అంతలోనే హజ్రత్ ఉస్మాన్(రజి) దూత నన్ను పిలవటానికి వచ్చాడు. నేను అతని వెంట ఉస్మాన్(రజి) సన్నిధికి వెళ్ళినప్పుడు, "నీవు ఇంతకీ ఏ శ్రేయం గురించి మాట్లాడాలనుకున్నావ్?" అని అడిగారు. అప్పుడు నేను ఇలా విన్న వించుకున్నాను: 'చూడండి, అల్లాహ్ ముహమ్మద్ (సఅసమ్)ను సత్యంతోపాటు పంపించాడు. ఆయనపై తన గ్రంథాన్ని అవతరింపజేశాడు. దైవ సందేశాన్ని, దైవ సందేశహరుని సందేశాన్ని స్వీకరించిన వారిలో మీరూ ఒకనిగా ఉన్నారు. మీరు రెండు ప్రదేశాలకు వలసపోయారు. దైవప్రవక్త(స) సహచర్య భాగ్యం పొందారు. ఆయన(స) విధానాన్ని, సంప్రదాయాన్ని చూశారు. కాని అసలు విషయం ఏమిటంటే, జనులు వలీద్ గురించి ఎన్నో ఫిర్యాదులు చేస్తున్నారు'.

దానికి హజ్రత్ ఉస్మాన్(రజి), "నీవు దైవప్రవక్త(స) ప్రవచనాలేమైనా విన్నావా?" అని అడిగారు. అప్పుడు నేను, 'లేదు. కాని దైవప్రవక్త(స) హదీసులు ఒక కన్నెపిల్ల వరకూ- ఆమె పరదాల్లో ఉన్నప్పటికీ- చేరిపోయాయి. అలాంటప్పుడు నాకు తెలియకుండా ఎలా ఉంటాయి' అన్నాను. సమాధానంగా హజ్రత్ ఉస్మాన్ (రజి) ఇలా అన్నారు: "నిశ్చయంగా అల్లాహ్ ముహమ్మద్(స)ను సత్యంతో పాటే పంపించాడు. దైవం, దైవప్రవక్త(స) సందేశాన్ని స్వీకరించిన వారిలో నేను కూడా ఒకణ్ణి. దైవప్రవక్త(స) ఏ సందేశంతోపాటు పంపబడ్డారో, దానిని పూర్తి స్థాయిలో నేను విశ్వసించాను. నీవు చెప్పినట్లు దైవమార్గంలో రెండు హిజ్రత్‌లు కూడా చేశాను. దైవప్రవక్త(స) సాంగత్యంలో కూడా ఉన్నాను. ఆయన సమక్షంలో విధేయతా ప్రమాణం (బైఅత్) కూడా చేశాను. దైవసాక్షి! నేను ఎన్నడూ ఆయన ఆజ్ఞల్ని ఉల్లంఘించలేదు. ఆయన(స) యెడల ఎన్నడూ విశ్వాసఘాతుకానికి పాల్పడ లేదు. కడకు అల్లాహ్ ఆయన(స)కు మరణం వొసగాడు. ఆ తరువాత అబూ బక్ర్ (రజి) పట్ల కూడా నేను ఇలాగే వ్యవహరించాను. ఉమర్(రజి) యెడల కూడా నా వ్యవహారం ఇలాగే ఉండేది. మరి అలాంటప్పుడు నన్ను వారి వారసునిగా చేసినప్పుడు, వారికి ఉన్న అధికారాలు (హక్కులు) నాకు ఉండవా?" 'ఎందుకు ఉండవు? తప్పక ఉంటాయి' అని నేనన్నాను. "మరి అలాంటప్పుడు మీ ద్వారా నా వరకు చేరే ఆక్షేపణలకు ప్రాతిపదిక ఏముంటుంది? ఇకపోతే, వలీద్ గురించి నీవు ప్రస్తావించిన విషయాలు, ఇన్‌షాఅల్లాహ్ అతనికి తగిన శిక్ష తప్పకుండా విధిస్తాను" అని ఉస్మాన్(రజి) హామీ ఇచ్చారు. హజ్రత్ ఉస్మాన్(రజి) హజ్రత్ అలీ(రజి)ని పిలిపించి, "వలీద్‌కి శిక్ష విధించండి" అని చెప్పారు. అందువల్ల ఆయన వలీద్‌కు ఎనభై కొరడా దెబ్బలు కొట్టారు.[1]

340-1. వలీద్ హజ్రత్ ఉస్మాన్(రజి)కి పాల వరుస సోదరుడు. స్వర్గలోక శుభవార్త పొందిన పదిమంది (అష్రె ముబష్షిరా) సహాబాలో ఒకరైన సాద్ బిన్ అబీ వక్కాస్(రజి)ను హజ్రత్ ఉస్మాన్(రజి) కూఫా గవర్నర్‌గా నియమించారు. ఈయనకు - అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి)కి మధ్య ఒకానొక విషయంలో గొడవ జరిగింది. అందువల్ల ఖలీఫా ఉస్మాన్ (రజి) వలీద్‌ను అక్కడి గవర్నర్‌గా నియమించారు.

వలీద్ మితిమీరి వ్యవహరించసాగాడు. మద్యం సేవించి జన సామాన్యంపై జులుమ్ చేశాడు. అందువల్ల ప్రజలు హజ్రత్ ఉస్మాన్ (రజి) పట్ల కినుక వహించారు. సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) లాంటి అగ్రశ్రేణి సహాబీని తొలగించి వలీద్ లాంటి అసమర్థునికి పదవి కట్టబెట్టడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమయింది. ఏ విధంగా చూసినా వలీద్ ఆ పదవికి తగినవాడు కాడు. పైగా అతడు దైవప్రవక్త(స) పట్ల అమానుషంగా ప్రవర్తించిన ఉఖబా బిన్ అబీ ముఅయ్‌త్ కుమారుడు. ఒకవేళ వలీద్ తన ప్రవర్తనను సరిదిద్దు కుని ప్రజల హృదయాలను జయించి ఉంటే ఏ గొడవా ఉండేది కాదు. కాని అతను తండ్రికి ఏమాత్రం తీసిపోనివాడుగా నిరూపించు కున్నాడు.



## అంతిమ దైవ సందేశహరుని ప్రభవనానికి పూర్వం

# అశాంతికి, అరాచానికి ఆలవాలంగా ఉన్న అరేబియా

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

### దొంగతనం

దొమ్మీలు దోపిడీలతో పాటు ఆర్థిక ఇక్కట్ల కారణంగా పల్లెటూరి బైతులలో దొంగతనం కూడా ఆనవాయితీగా ఉండేది. వివిధ తెగలలో సుప్రసిద్ధులు, పరాక్రమశాలురు కానివారు ప్రత్యేకంగా ఈ వృత్తిని ఆశ్రయించేవారు. ఒంటరిగా వెళ్ళి అత్యంత ప్రమాద కరమయిన పరిస్థితిలో ఈ పని చేసేవారు. పైగా దానిని తమ ఘనకార్యంగా చెప్పుకునేవారు. అలాంటి వారిలో సలీక్ బిన్ సలికా, నాబత్ షర్రన్ సుప్రసిద్ధులు.

ఖురైషులు వ్యాపారవేత్తలు కావటం వల్ల వారి దగ్గర సంపద బాగానే ఉండేది. స్వయంగా కాబా గృహంలో కానుకల, నజరానాల రూపేణా వచ్చిన ధనం పుష్కలంగా ఉండేది. అందు వల్ల అక్కడ దొంగతనానికి పాల్పడే అవకాశాలు కూడా ఎక్కువ గానే ఉండేవి. అలా దొంగతనానికి పాల్పడే అనేకమంది ఖురైషుల పేర్లను కల్బీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అబూ లహబ్ పేరు ప్రత్యేకంగా ప్రస్తావనకు వచ్చింది.

అరేబియాలోని పల్లెవాసులలో ఈ దొంగతనం ఎంతగా ప్రబలి పోయిందంటే, వారిలోని స్త్రీలు పురుషులు ఇస్లాం స్వీకరించ డానికి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చినప్పుడు, ఆయన అనేక ఇతరత్రా అంశాలపై ప్రతిజ్ఞ (బైఅత్) చేయించటంతో పాటు "దొంగతనానికి పాల్పడబోము" అన్న దానిపై కూడా ప్రతిజ్ఞ చేయించేవారు.

దొంగతనానికి సంబంధించిన చిత్రవిచిత్రమయిన పద్ధతుల్ని వారు సృష్టించారు. ఒక వ్యక్తి తన లాఠీ అంచుమీద ఒక ఇనుప కొక్కెం లాంటిది తగిలిస్తాడు. అతడు హజ్జ్‌కు వస్తాడు. అక్కడి హజ్జ్ యాత్రీకులు పరధ్యానంలో ఉండటం చూసి, వారి వెనుక నుంచి వారి వస్తుసామగ్రిని లాక్కునేవాడు (ముస్లిం).

అరేబియాలో 'తై' తెగవారు దొమ్మీలు దోపిడీలలో సుప్రసిద్ధులై నట్లే కొన్ని తెగలవారు దొంగిలించడంలో ప్రవీణులుగా ఉండే వారు. ఉదాహరణకు : అస్లం, గిఫ్ఫార్, ముజైనా, జుహన్నియా తెగలవారు యావద్దేశంలో ఈ అపఖ్యాతిని మూట కట్టుకున్నారు. ముఖ్యంగా హాజీల సామానులను, సరుకులను వారు తస్కరించే వారు *(ముస్లిం, బుఖారీ – అస్లం, గిఫ్ఫార్ తెగల అధ్యాయం).*

అరేబియాలో ప్రబలిన ఈ దొంగతనానికి ప్రధాన కారణం అక్కడి దుర్భిక్షం, ఆర్థిక సంక్షోభమే. అందుకే వారు దొంగిలించే సమ యంలో తమ వారు, పరాయి వారు అని కూడా చూడకుండా దొరికిందే చాలనుకునేవారు. దీని దుష్ప్రభావం బంధువులపై, పొరుగు వారిపై, మిత్రులపై, బాటసారులపై, వివిధ కుటుంబీ కులపై కూడా పడేది. మదీనాలో బషర్, బుషైర్, ముబష్షిర్ అనే ముగ్గురు వ్యక్తులుండేవారు. వీరిలో బుషైర్ అనేవాడు కపటి (మునాఫిక్). అతను దైవప్రవక్త (స)పై పరోక్షంగా దుర్విమర్శ చేస్తూ ఉండేవాడు. వీరు ముగ్గురూ దారిద్ర్యంలో మగ్గుతుండే

వారు. తరచూ పస్తులుండేవారు. ఒకరోజు వారు రిఫాఅ అనే ఒక వ్యక్తి ఇంట్లో – మంచెపై ఉన్న – ఆయుధాలను దొంగిలించారు. దైవప్రవక్త (స) విచారణ జరిపి రిఫాఅ ఆయుధాలను వాపసు ఇప్పించారు. అయితే రిఫాఅ ఆ ఆయుధాలను దైవ మార్గంలో ఇచ్చేశారు. కాని కపటి అయిన బుషైర్ మాత్రం మదీనా నుండి పరారై బహుదైవారాధకులలో కలసిపోయాడు (తిర్మిజీ).

పురుషులు మాత్రమే కాకుండా స్త్రీలు కూడా ఈ జాడ్యానికి గురై ఉండేవారు. అందుకే దివ్య ఖుర్ఆన్ స్త్రీల చేత ప్రతిజ్ఞ (బైఅత్) చేయించేటప్పుడు, తాము దొంగతనానికి పాల్పడబోము (ముమ్తహిన) అనే షరతులను కూడా చేర్చింది. ఒకవేళ మర్యాదస్తులు, గొప్పింటి మహిళలు దొంగతనం చేస్తూ పట్టుబడితే వారిని శిక్షించకుండా వదలిపెట్టేసేవారు. అందువల్ల ఈ చెడుగును అరికట్టడం దుర్లభమైపోయింది. ఇస్లాం ఆవిర్భావం తరువాత కూడా మఖ్జూమ్ తెగకు చెందిన ఒక మహిళ దొంగతనానికి ఒడిగట్టినప్పుడు ఖురైషులు ఎంతో ఆవేదనకు గురయ్యారు. ఆమెను ఎలాగైనా శిక్ష నుండి తప్పించాలని ఆలోచించారు. దైవప్రవక్త (స)కు ఎంతో ప్రియతముడైన ఉసామా బిన్ జైద్ (రజి) అనే నవ యువకుని చేత సిఫారసు చేయించారు. ఈ విషయమై ఉసామా దైవప్రవక్త (స)తో మాట్లాడినప్పుడు ఆయన మోము ఆగ్రహంతో కందిపోయింది. వెంటనే దైవప్రవక్త (స) జనులను సమావేశపరచి ప్రసంగించారు. ఆయన (స) ఇలా అన్నారు : "ఏమిటి, మీరు దేవుని శిక్షల విషయంలో సిఫారసులు చేస్తున్నారా? పూర్వపు జాతులవారు ఈ కారణంగానే నాశనమయ్యారు. ఉన్నత కుటుంబీకులు దొంగతనం చేస్తే వారిని విడిచిపెట్టేసేవారు. అదే ఒక పేద వ్యక్తి, బడుగు వర్గానికి చెందిన వాడు దొంగతనం చేస్తే శిక్ష విధించేవారు. వినండి! దైవసాక్షిగా! ఒకవేళ దైవ సందేశహరుని పుత్రిక ఫాతిమా దొంగతనానికి పాల్పడినా సరే, ఆమె చెయ్యి నరకటానికి నేను వెనుకాడను."

*(బుఖారీ–శిక్షల ప్రకరణం)*

పట్టణాలలో సైతం ఇలాంటి తస్కర ఘటనలు సర్వసామాన్యమై ఉండేవి. ఒకసారి సఫ్వాన్ బిన్ ఉమయ్యా అనే ఒక సహాబీ ఖరీదైన కంబలి కప్పుకుని నిద్రిస్తుండగా ఒక తస్కరశ్రేష్ఠుడు అదను చూసి ఆ కంబలిని తస్కరించాడు. కాని అతను పట్టుబడ్డాడు. వ్యవహారం దైవప్రవక్త (స) వరకూ తీసుకురాబడింది. అతని చెయ్యి నరకమని దైవప్రవక్త (స) ఆజ్ఞాపించారు. కాని సఫ్వాన్‌కు ఆ వ్యక్తిపై జాలి కలిగింది. ఆయన వచ్చి, 'దైవప్రవక్తా! కేవలం ఒక కంబలిని దొంగిలించినందుకు ఒక అరబ్బు పౌరునికి హస్తఖండన శిక్ష విధించబడుతుందా?' అని అడిగారు. దానికాయన (స), "నీకు అతనిపై అంతగా జాలి ఉంటే ఈ వ్యవహారాన్ని అక్కడికక్కడే తేల్చుకోవాల్సింది. నా దగ్గరకు ఎందుకు తీసుకువచ్చావు? పరిపాలకుని వరకూ వ్యవహారం వచ్చాక ఎవరికీ సిఫారసు చేసే హక్కు ఉండదు" అన్నారు.

*(బుఖారీ – శిక్షల ప్రకరణం)*

## కాఠిన్యం, క్రూరత్వం

అహోరాత్రులు దోపిడీలు చేసి రక్తపాతం సృష్టించటం వల్ల వారిలో క్రూరమృగాల కర్కశ గుణాలు పొడసూపాయి. సజీవంగా ఉన్న ఒంటెల మూపురాలను, పొట్టేలు వెనుక ఉన్న కొవ్వు భాగాన్ని కోసుకుని కబాబులు వేయించేవారు. అది వారికి ఎంతో ఇష్టకరమయిన భక్ష్యం.

బ్రతికి ఉన్న పశువులను చెట్లకు కట్టి వాటిపై విలువిద్యను అభ్యసించేవారు. యుద్ధాలలో స్త్రీల గర్భాలను చీల్చి, వారి శరీరావయవాలతో దండలు తయారు చేసి తమ స్త్రీలకు తొడిగించేవారు. శత్రువును గనక వధించినట్లయితే, అతని పుర్రెలో సారాయి పోసుకుని తాగుతామని మొక్కుకునేవారు.

వారు నేరస్తులను శిక్షించే ఒక పద్ధతి ఎలా ఉండేదంటే రెండు వృక్షాల కొమ్మలను వంచి నేరస్థుని శరీరావయవాలను వాటికి కట్టేసేవారు. ఆ తరువాత ఆ కొమ్మలను వదిలేస్తే అతని శరీర భాగం రెండుగా చీలిపోయేది.

అప్పుడప్పుడూ స్త్రీలను గుర్రపు తోకలకు కట్టి గుర్రాలను పరుగెత్తించేవారు. అప్పుడు ఆ స్త్రీల శరీరాలు ముక్కచెక్కలైపోయేవి. అరబ్బు పరిపాలకులు, శ్రీమంతులు ఎక్కువగా ఈ అమానుష పోకడలకు పాల్పడేవారు.

ఒక్కోసారి ఒక మనిషిని ఏదయినా ఇరుకైన గదిలో బంధించి అన్నపానీయాల సరఫరాను నిలిపివేసేవారు. ఆ వ్యక్తి ఆకలితో, దప్పికతో విలవిల్లాడుతూ ప్రాణం విడిచేవాడు. ఈ రకమయిన శిక్షకు వారు "ఓర్పు" అని పేరు పెట్టారు. మృతుని సమాధి దగ్గర ఒంటెను కట్టేసి మేత మేయకుండా వదిలేసేవారు. అది కొన్నాళ్ళకు ఆకలితో చచ్చిపోయేది. అలా చచ్చిన ఒంటె ఆ మృతునికి వాహనంగా ఉంటుందని భావించేవారు. అలాంటి ఒంటెను "బలియా" అనేవారు.

***(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వీ–రహ్మ– విరచితమైన 'సీరతున్నబీ' పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)***



# మౌనంగా ఉండడం అంటే...

- నసీరా బేగం

**ఎప్పుడైతే** మౌనంగా ఉంటాడో అతను విముక్తిని పొందుతాడు అని అరబీ భాషలోనూ, ఎవడైతే మౌనంగా ఉంటాడో అతను నూరు సుఖాలను పొందుతాడు అని ఉర్దూ భాషలోనూ సామెతలు ఉన్నాయి. ఇది వాస్తవం కూడాను. ఒకవేళ ఏ మనిషైతే మౌనంగా ఉండటం, తన నాలుకను అదుపులో ఉంచుకోవటం నేర్చుకుంటాడో అతను ఎన్నో ఆపదల నుంచి, కష్టాల నుంచి రక్షణ పొందుతాడు. అంతేకాదు దానిద్వారా సమాజంలో తలెత్తే ఎన్నో కష్టాల నుంచి, కల్లోలాల నుంచి ప్రజలను కూడా కాపాడు కోగలుగుతాడు.

మన కుటుంబ జీవితంలో, పరస్పర సంబంధాలలో, సమాజ సమస్యలలో, ప్రజల మధ్య ఏర్పడే మనస్పర్థలలో, పోట్లాటలలో నాలుక ద్వారా వెలువడే మాటలదే ముఖ్యమైన పాత్ర ఉంటుంది. ఆ మాటల విషం ఇద్దరు సోదరులను శత్రువులుగా చేసేస్తుంది. దగ్గరి సంబంధాలను త్రెంచివేస్తుంది. సమాజంలో కల్లోలాన్ని రేకెత్తిస్తుంది. దీనికి గురైన ప్రజల ఇహపరలోకాలు రెండూ నష్టానికి గురవుతాయి. కనుకనే దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; చాలా మంది ప్రజలు తన నాలుక ద్వారానే నరకంలోకి చేరుతారు అని.

బాణంతో అయిన గాయం అయినా మానుతుంది కాని నాలుక ద్వారా అయిన గాయం మానటం కష్టం అని హజ్రత్ అలీ(రజి) సెలవిచ్చారు. కనుక మనిషి అనవసరమైన మాటలు మాట్లాడ కుండా మౌనంగా ఉండటం, అవసరమైన మాటలనే మాట్లాడటం ఉత్తమం. అనవసరంగా మాట్లాడటం వల్ల దాని ప్రభావం మనిషి వ్యక్తిగత జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. ఇంకా ఇతరుల సామాజిక, సామూహిక జీవితాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మనిషి సంఘజీవి కనుక అతను ఎల్లప్పుడూ మాట్లాడవలసి ఉంటుంది. అయితే అతను మాట్లాడవలసి వచ్చినప్పుడు మంచి మాటలను, మేలును కలిగించే మాటలను మాత్రమే మాట్లాడాలి. అంతేకాని సమయం ఉందనో, ఏ అంశమూ లేదనో ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కూర్చోరాదు. తన విశ్వాసాన్ని పటిష్టపరిచే మాటలనో, ఇతరులకు సహాయం చేసే మాటలనో, గ్రంథ జ్ఞానపు మాటలనో మాట్లాడుకుంటూ ఉండాలి. దానిద్వారా ఇహపర లోకాలలో ఈ నాలుక ద్వారా సాఫల్యం కూడా లభిస్తుంది.

హజ్రత్ సమాక్(ర) ఇలా అన్నారు : నేను సమ్ర (రజి)ను ఇలా అడిగాను;మీరు దైవప్రవక్త(స) గారి సమావేశాలలో హాజరయ్యే వారా? అని దానికి ఆయన(ర) అవును, హాజరయ్యే వాడిని. కాని ఆయన(స) ఎక్కువగా మౌనంగానే ఉండేవారు అని సమాధానమిచ్చారు. అంటే అవసరమైనప్పుడే మాట్లాడేవారు.

హజ్రత్ అబూ ఇద్రీస్ ఖౌలాని(ర) ఇలా అన్నారు : నేను డమాస్కస్ మసీదులో హాజరయ్యాను. అప్పుడు అక్కడ ఒక పెద్దాయనను చూశాను. ఆయన ముందు దంతాలు తెల్లగా మెరిసిపోతూ ఉన్నాయి. ఆయన చాలా మౌనంగా కూర్చొని ఉన్నారు. ఆయనతో పాటు మరికొంతమంది ఉన్నారు. వారిలో ఏవైనా విభేదాలు వచ్చినప్పుడు ఆయనను సంప్రదిస్తున్నారు. తరువాత ఆయన

ఆ విషయాన్ని గురించి తీర్పు చెప్పినప్పుడు వారు దానిని అంగీకరిస్తున్నారు, సంతృప్తి చెందుతున్నారు. ఇది చూసి నేను ఈయన ఎవరు? అని అక్కడి వారిని ప్రశ్నించాను. వారు, ఈయన గారు మాజ్ బిన్ జబల్(ర) అని తెలియజేశారు. దీనిద్వారా తెలిసిన విషయమేమిటంటే, మౌనం గాంభీర్యాన్ని, మనిషి విలువను పెంచుతుంది అని.

హజ్రత్ అసిమ్(ర) ఇలా తెలియజేశారు : ఒకసారి హజ్రత్ ఉమర్(ర) హజ్రత్ అబూబకర్(ర) వైపు తొంగి చూశారు. అప్పుడు ఆయన(ర) తన నాలుకను పట్టి లాగుతున్నారు. ఓ అమీరుల్ మోమినీన్! ఏమిటి? ఇలా చేస్తున్నారు అని ఆశ్చర్యంగా ఆయన్ని అడిగారు. దానికి ఆయన(ర) ఇది నాకు నాశనానికి గురి అయ్యేలా చేస్తుంది. దైవప్రవక్త(స) దీని గురించి ఇలా సెలవిచ్చారు; శరీరంలోని ప్రతి అవయవం నాలుక పదునుతనాన్ని గురించి ఫిర్యాదు చేస్తుంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్(ర) ఇలా సెలవిచ్చారు; అల్లాహ్ సాక్షిగా! ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు. ఈ భూమిపై ఏ వస్తువూ నాలుక తప్ప జీవిత ఖైదు చెయ్యబడేది మరేదీ లేదు. కనుక నేను మీకు బోధించేదేమిటంటే, అవసర మున్నంత మేరకే మాట్లాడండి. ఎందుకంటే ప్రళయదినం నాడు అధిక పాపాలు నాలుకతో అనవసరపు మాటలు మాట్లాడిన వారిని, వాదనలు, వాగ్వివాదాలు చేసిన వారివే ఉంటాయి.

నాలుక శరీరాన్నంతటినీ సంస్కరించే ముఖ్యమైన అవయవం. ఒకవేళ నాలుక సంస్కరింపబడితే శరీరం మొత్తం సంస్కరించ బడుతుంది. ఒకవేళ అది సంస్కరించబడకపోతే శరీరం మొత్తం సంస్కరింపజాలదు.

హజ్రత్ అబూ దర్దా(ర) ఇలా అన్నారు : ఏవిధంగానైతే మీరు మాటలు మాట్లాడటం నేర్చుకున్నారో అదే విధంగా మౌనంగా ఉండటం కూడా నేర్చుకోండి. ఎందుకంటే మౌనంగా ఉండటం అనేది చాలా సహనంతో, మీకు మాట్లాడటం కంటే కూడా ఇతరుల మాటలను వినే ఓర్పు, ఆశక్తి ఎక్కువగా ఉండాలి. ఇంకా ఎప్పుడూ అనవసరమైన మాటలు మాట్లాడకండి. నవ్వురాని మాటలకు నవ్వకండి. ఇంకా అవసరం లేని చోటుకు వెళ్ళకండి.

ఇంకా ఇలా అన్నారు : అల్లాహ్‌కు విశ్వాసి యొక్క శరీరంలోని ఏ అవయవం నాలుక కంటే ప్రియమైనది కాదు. దాని కారణంగా అతన్ని అల్లాహ్ స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు. ఇంకా అవిశ్వాసి యొక్క ఏ అవయవం అల్లాహ్‌కు నాలుక కంటే అయిష్టమైనది, ఆగ్రహానికి గురిచేసేది మరొకటి ఏమీ లేదు. దీని కారణంగా అల్లాహ్ అతన్ని నరకంలోకి ప్రవేశింపజేస్తాడు.

హజ్రత్ ఇబ్నె ఉమర్(ర) ఇలా సెలవిచ్చారు : మనిషి అన్నింటి కంటే ఏదైనా అవయవం శుభ్రపరచవలసి ఉందంటే, అది నాలుకయే.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్(ర) ఇలా సెలవిచ్చారు : ఏ వ్యక్తి కూడా తన నాలుకను కాపాడుకోనంత వరకు విశ్వాసి కాజాలడు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్(ర) ఇలా సెలవిచ్చారు; ఒక వ్యక్తి దైవప్రవక్త(స)తో ఇలా విన్నవించుకున్నాడు; ముస్లిం లందరిలో ఉత్తమమైన ముస్లిం ఎవరు అని. దానికి ఆయన(స) ఇలా సెలవిచ్చారు; ఎవరి చేతిలోనైతే, ఎవరి నోటిలోనైతే ఇతర ముస్లిములు సురక్షితంగా ఉంటారో అతను.

మౌనంగా ఉండటం అంటే దాని అర్థం మౌనవ్రతం పాటించటం అని ఎంతమాత్రమూ కాదు. కాని దాని అర్థం ఏమిటంటే, మనిషి అనవసరపు, వ్యర్థమైన మాటలను మాట్లాడకూడదు. ఇతరులకు కష్టం కలిగించే, నష్టం కలిగించే మాటలను మాట్లాడకూడదు. వ్యంగ్యమైన మాటలు మాట్లాడకూడదు. సమయం, సందర్భం లేనప్పుడు మాటలు మాట్లాడకూడదు. దానికి వ్యతిరేకంగా అవసరమైనప్పుడు మనిషి తప్పకుండా మాట్లాడాలి. కాని సత్యమైన మాటలనే మాట్లాడాలి. ఆచితూచి మాట్లాడాలి. ప్రజలకు హితబోధ చేసే మాటలను మాత్రం తప్పకుండా మాట్లాడాలి. మంచిని పెంచే, చెడును త్రుంచే బాధ్యత ఉన్న కారణంగా విశ్వాసులు దానికి సంబంధించిన మాటలను కూడా మాట్లాడాలి. బోధనలు చేయాలి. ప్రసంగాలు చేయాలి.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; ఏ వ్యక్తి అయితే అల్లాహ్‌ను, ప్రళయ దినాన్ని విశ్వసిస్తాడో అతను మాట్లాడితే మంచి మాటనే పలకాలి. లేకపోతే మౌనాన్ని పాటించాలి. (బుఖారీ)

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# జామియా ఉస్మానియా నూరేళ్ళ విద్యా వనం



**ఉమైర్**

**అసెంబ్లీ** ఎన్నికల ఫలితాలు వచ్చాయి, కాంగ్రెస్ విజయం సాధించాంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కూడా కాంగ్రెస్ విజయోత్సవాలు జరిగాయి. బీఆరెస్ పట్ల వైముఖ్యం ఉస్మానియా క్యాంపస్‌లో కూడా కనిపించింది. ఇదొక అనూహ్యమైన మార్పు. ఉద్యోగాలు నిరుద్యోగ సమస్య పట్ల విద్యార్థులు గళమెత్తుతున్నారు. పదేళ్ళ క్రితం ఉస్మానియాలో పరిస్థితి ఇలా లేదు. అప్పట్లో ఉస్మానియా ప్రత్యేక తెలంగాణా పోరాటానికి ముఖ్య వేదికగా మారింది. విద్యార్థి గర్జనలు హెూరెత్తాయి. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం నడిపిన అప్పటి టీఆరెస్ పార్టీ రాష్ట్రాన్ని సాధించింది. విద్యార్థి నాయకులు కూడా కొందరు రాజకీయాల్లోకి వచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం కేవలం విద్యాసంస్థగా మాత్రమే కాదు ఉద్యమాలకు, సామాజిక పోరాటాలకు నిలయంగా తన ప్రత్యేకత నిలబెట్టుకుంటూ వస్తోంది. ఈ సందర్భంగా ఒకసారి ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రను చూద్దాం.

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఒకప్పటి హైదరాబాద్ సంస్థానం చరిత్రకు సాక్షి. హైదరాబాద్ సంస్థాన విలీనం నాటి రక్తపాతాల చరిత్ర, స్థానికులకు ఉద్యోగాల ఉద్యమాలు, తెలంగాణ పోరాటం ఇలా అనేక పోరాటాలు ఉస్మానియా కళ్ళారా చూసింది. ఉస్మానియా స్థాపనలో ఉన్న ముస్లిమ్ వారసత్వ చిహ్నాలు, సాంస్కృతిక వైవిధ్యానికి పెద్ద పీట వేసిన చరిత్ర, ఇంగ్లీషు భాషలో ఆధునిక విద్యా బోధనకు ముఖ్య కేంద్రంగా మారిన పరిణామాలు... జామియా ఉస్మానియా సుదూర ప్రయాణంలో దాటిన మైలురాళ్ళు ఎన్నో.

ఉర్దూ బోధనా భాషగా భారతదేశంలో ఏర్పడిన మొట్టమొదటి విశ్వవిద్యాలయం ఉస్మానియా. అప్పటికి దేశంలో భారతీయ భాషల్లో ఏ ఒక్క భాష కూడా ఏ విశ్వవిద్యాలయంలోను బోధనా భాషగా లేదు. భారతీయ భాష ఉర్దూ బోధనా భాషగా ఏర్పడిన ఉస్మానియాలో ఇంగ్లీషు భాష తప్పనిసరిగా చదవవలసిన ఒక సబ్జక్టుగా ఉండేది. ఏప్రిల్ 26, 2017 నాటికి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయ్యాయి. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, ఘనమైన చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఉస్మానియా సాంప్రదాయికతను, ఆధునికతల అత్యుత్తమ మేళవింపు. శత వసంతాలు పూర్తి చేసుకున్న ఉస్మానియా చరిత్ర గురించి కొంతైనా తెలుసుకోవడం చాలా అవసరం.

మాజీ ప్రధాని పి.వి.నరసింహరావు, భారతదేశం రోదసీలోకి పంపించిన మొదటి వ్యోమగామి రాకేష్ శర్మ (అప్పటి ప్రధాని

ఇందిరాగాంధీ భూగ్రహంపై భారతదేశం ఎలా కనబడుతుందని అడిగితే "సారే జహాం సే అచ్ఛా" అంటూ అల్లమా ఇక్బాల్ కవితా పాదాన్ని వినిపించారు), ప్రసిద్ధ సినిమా దర్శకుడు శ్యామ్ బెనెగల్, ఆర్బీఐ మాజీ గవర్నరు వై. వేణుగోపాలరెడ్డి, మెగసేసే అవార్డు పొందిన శాంత సిన్హా, ఉర్దూ మీడియంలో వైద్యశాస్త్రం అభ్యసించిన డా.మర్రి చెన్నారెడ్డి తదితరులు ఈ విశ్వవిద్యాలయం లోనే విద్యాభ్యాసం చేశారు.

ఏప్రిల్ 26, 1917 తేదీన హైదరాబాద్ సంస్థానాన్ని పాలిస్తున్న ఏడవ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ జారీ చేసిన ఫర్మానాతో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉనికిలోకి వచ్చింది. భారత దేశంలో అతి పాత విశ్వవిద్యాలయాల్లో ఉస్మానియా ఏడవది. దక్షిణ భారత దేశంలో మూడవది. అప్పట్లో ప్రభుత్వానికి హోం సెక్రటరీ హోదాలో పనిచేస్తున్న సర్ అక్బర్ హైదరీ విద్యాశాఖకు ఒక మెమొరాండంలో విశ్వవిద్యాలయం అవసరమని నొక్కి చెప్పాడు. ఉర్దూ బోధనాభాషగా విశ్వవిద్యాలయం ఏర్పడాలని కూడా నొక్కి చెప్పాడాయన. భారతదేశంలో ప్రజలు అధికంగా మాట్లాడే భాషగాను, సంస్థానంలో అధికార భాషగాను ఉన్న ఉర్దూయే బోధనా భాషగా ఉండాలని చెప్పాడు. నిజానికి అప్పటి వరకు దేశంలో ఇంగ్లీషు తప్ప బోధనాభాషగా మరొకటి లేదు.

నిజాం జారి చేసిన ఫర్మానాలో విశ్వవిద్యాలయ లక్ష్యాలు ఉద్దేశ్యాలు స్పష్టంగా పేర్కొన్నారు.

ప్రాచీన, ఆధునిక, ప్రాచ్య, పాశ్చాత్య విద్యాజ్ఞానాల మేళవింపుగా ఉండాలని, ప్రస్తుత విద్యావ్యవస్థలోని లోపాలు తొలగించేదిగా ఉండాలని ఫర్మానాలో నిర్దేశించాడు. ఉర్దూ బోధనా భాషగా ఉండాలని, ఇంగ్లీషు భాష నేర్చుకోవడం తప్పనిసరి చేయాలని కూడా ఫర్మానా పేర్కొంది.

మొదటి ప్రపంచయుద్ధం తర్వాతి కాలమది. అంతకుముందు 1857 ప్రథమ స్వతంత్ర సంగ్రామం విషాదాలు ఇంకా పచ్చిగానే ఉన్న కాలమది. ఉర్దూ బోధనాభాషగా ఉండాలన్న నిర్ణయం వెనుక దేశభక్తి భావాలు బలంగా పనిచేశాయి. భారతదేశంలో విదేశీభాష ప్రాబల్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు దీని వెనుక ఉంది. ఒక భారతీయ భాషను బోధనా భాషగా ఉన్నత విద్యా బోధన ప్రారంభించిన ప్రయోగాత్మక ప్రయత్నాన్ని నోబుల్ బహుమతి గ్రహిత రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రశంసిస్తూ, "విదేశీ భాష సంకెళ్ళు తెంచుకుని మన విద్యావ్యవస్థ మన ప్రజలకు సహజంగా అందుబాటులోకి వచ్చే రోజు కోసం నేను చాలా కాలంగా ఎదురు చూస్తున్నాను. ఈ భాషా సమస్యకు పరిష్కారం కోసం మేము మన స్థానిక రాజ్యాల వైపు చూస్తున్నాం. చివరకు మీ రాజ్యంలో ఉన్నత విద్యాబోధనకు ఉర్దూ బోధనాభాషగా విశ్వవిద్యాలయం ఏర్పడుతుందని తెలిసి నాకు చాలా సంతోషం కలిగింది. మీ ప్రయత్నాలకు నా సంపూర్ణ మద్దతు ఉందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు." అని రాశారు.

ప్రముఖ బ్రిటీషు విద్యావేత్త, సర్ మైకెల్ శాడ్లర్ ఈ ప్రయత్నాన్ని ప్రశంసిస్తూ లేఖ రాశాడు.

ఈ ఫర్మానా జారి అయిన తర్వాత రెండేళ్ళ లోపే మొదటి బ్యాచ్ తరగతులు గన్‌ఫౌండ్రీలో ప్రారంభమయ్యాయి. 1919లో మొదట తరగతులు ప్రారంభమైన భవనం నేడు హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ నడుస్తోంది. గన్‌ఫౌండ్రీ ప్రాంతంలో నిజామ్ కాలేజి రెండవ గేటు పక్కన యు.పి.హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ హాలు ఉంది. 1919లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇక్కడే మొదటి బ్యాచ్ ప్రారంభ మైంది. ఈ భవనం మహారాజా కిషన్ ప్రసాద్‌కు చెందిన భవనం. 1934లో ఉస్మానియా ప్రాంగణం నిర్మాణానికి ముందు వరకు ఇక్కడే తరగతులు జరిగేవి. దీనికి ముందు మదరస యే ఆలియా ఉంది. ఈ భవనం నుంచే ఉస్మానియా ప్రయాణం మొదలైంది. ప్రసిద్ధ ఉర్దూ కవి, తెలంగాణా సాయుధ పోరాటానికి పిలుపు నిచ్చిన త్రిమూర్తులలో ఒకడైన మఖ్దూం ముహియుద్దీన్ కూడా చదువుకున్నది ఇక్కడే. ఆయన చదివిన కాలంలో తరగతులు ఎలా జరిగేవంటే, అప్పట్లో స్వంత భవనం లేదు. ఒక్కో క్లాసు ఒక్కో చోట జరిగేది. ఒక్కోసారి ఒక క్లాసు పూర్తయ్యాక విద్యార్థులు మరో క్లాసుకు వెళ్ళాలంటే రెండు మూడు ఫర్లాంగులు వెళ్ళవలసి వచ్చేది. ఇక ఉర్దూ భాష చదివే వారి పరిస్థితి మరీ విచిత్రం. మౌల్వీ అబ్దుల్ హక్ పబ్లిక్ గార్డెన్స్‌లో ఏదో ఒక చెట్టుక్రింద క్లాసులు తీసుకునేవారు. వర్షం వస్తే అక్కడి నుంచి ఆబిడ్స్‌లోని ఒక లైబ్రరీకి వచ్చేవారు. ప్రొఫెసర్ సజ్జాద్ ఒక హోటలులో ఉండి, విద్యార్థులను అక్కడికి పిలిచి పాఠాలు చెప్పేవారు. డాక్టర్ జోర్ మర్ఘూమ్, మౌల్వీ అబ్దుల్ ఖాదర్ సుర్వరీల క్లాసులు ఫతేమైదాన్ లోని ఒక భవనంలో జరిగేవి. జోర్ మర్ఘూమ్ విద్యార్థుల రచనాసక్తిని ప్రోత్సహించేవారు. అలా లభించిన ప్రోత్సాహంతోనే తాను "టాగోర్ కవిత్వం" అన్న పుస్తకం రాశానని మఖ్దూం రాసుకున్నాడు.

మొదటి సంవత్సరం విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్, థియొలజీ మాత్రమే ఉండేవి. అంటే రెండు డిపార్టుమెంట్లు మాత్రమే. 225 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు. 25 మంది ఫాకల్టీ. సంస్కృతం, తెలుగు, కన్నడ, మరాఠీ, పర్షియన్, అరబీ, ఉర్దూ భాషల్లో కోర్సులు ఉండేవి. ఏ కోర్సు చదివినా ఇంగ్లీషు ఒక భాషగా అధ్యయనం చేయడం తప్పనిసరి. అప్పట్లో పరదా

సంప్రదాయం సమాజంలో చాలా బలంగా ఉండేది. అందువల్ల విద్యార్థినులకు సదుపాయాలు ప్రత్యేకంగా కల్పించారు. విద్యార్థులు, విద్యార్థినుల తరగతులు వేర్వేరుగా జరిగేవి. ఒకే క్లాసులో పాఠం వినవలసి వస్తే, విద్యార్థులకు, విద్యార్థినులకు మధ్య ఒక కర్టెన్ ఏర్పాటు చేసేవారు. 1934లో యూనివర్శిటీ కోసం 566 ఎకరాలు కేటాయించడం జరిగింది. ఆర్ట్ కాలేజి భవనానికి నిజాం స్వయంగా శంఖుస్థాపన చేశారు. పనివారిని తరలించడానికి, నిర్మాణ సామాగ్రి తరలించడానికి రైల్వే ట్రాకులు ప్రత్యేకంగా వేశారు. నాలుగేళ్ళలో ఆర్ట్స్ కాలేజీ భవనం అద్భుతమైన నిర్మాణంగా పూర్తయ్యింది. ముగల్, కుతుబ్‌షాహీ వాస్తు సమ్మేళనంతో కట్టిన భవనమిది. బెల్జియంకు చెందిన ఆర్కిటెక్ట్ మాన్సార్ జాస్పర్ డిజైను చేశారు. 164 పెద్ద పెద్ద గదులు, రెండున్నర లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించిన అతిపెద్ద భవనమిది. డిజైను చేసిన మాన్సార్ జాస్పర్ పేరే తర్వాత మూసారాం బాగ్‌గా మారిందని అంటారు. మెడిసిన్, ఇంజనీరింగ్, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పిహెచ్‌డి అన్ని కోర్సుల్లోను ఉర్దూ బోధనా భాష. అవసరమైన పాఠ్యపుస్తకాల కోసం పెద్ద ఎత్తున అనువాద కార్యక్రమం జరిగింది. మెడిసిన్ కోర్సులు కూడా ఉర్దూలో నిర్వహించడానికి ఎలాంటి ఇబ్బంది కలుగలేదు.

భారతీయ భాషలో విద్యాబోధన నిర్ణయం అప్పట్లో సాహసోపేతమైన నిర్ణయం. నిజానికి ఉర్దూను ఉస్మానియా ద్వారా సెక్యులర్ భాషగా ప్రవేశపెట్టడం ద్వారా నిజామ్ చేసిన ప్రయత్నాన్ని దాట్ల కవితా సరస్వతి తన పుస్తకంలో ప్రశంసిస్తూ రాశారు. నిజానికి నిజామ్ బ్రిటీషు వారికి మిత్రుడిగా ఉన్నప్పటికీ, ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ఉర్దూ బోధనా భాషగా ఏర్పాటు చేయడం ద్వారా బ్రిటీషు వారిని సవాలు చేశాడు. బిజినెస్, సైన్సు వగైరా రంగాల్లో ఇంగ్లీషుకు ప్రాబల్యానికి విసిరిన సవాలిది. భారీ స్థాయిలో జరిగిన అనువాద కార్యక్రమమే దీనికి సాక్ష్యం. పాశ్చాత్య విద్యావ్యవస్థ ప్రభావాన్ని భారతీయీకరణకు చేసిన ప్రయత్నమిది. ఉర్దూ నిజానికి ముస్లిముల భాషగా భావించడం పొరబాటు. ఈ విషయాన్నే దాట్ల కవితా సరస్వతి తన పుస్తకం"ది లాంగ్వేజ్ ఆఫ్ సెక్యులర్ ఇస్లామ్"లో ప్రముఖంగా రాశారు. 1830 నాటికే ఉర్దూ భారతదేశంలో పర్షియన్ స్థానాన్ని ఆక్రమించుకుంది. పాలనాయంత్రాంగంలో ఉర్దూ చెలామణిలోకి వచ్చేసింది. బిహార్, నార్త్ వెస్ట్ ప్రావిన్సెస్, సెంట్రల్ ప్రావిన్సెస్‌లో చాలా చోట్ల, పంజాబ్, కశ్మీర్, హైదరాబాదుల్లో ఉర్దూ ప్రజల భాషగా గుర్తింపు పొందింది. ఈ అధికార భాషా విధానం 1900 తర్వాత కూడా కొనసాగింది. ఆ తర్వాత కొన్ని ప్రాంతాల్లో హిందీని కూడా చేర్చడం జరిగింది. దేశ విభజనకు ముందు ఉర్దూ ముస్లిముల భాషగా ముస్లిములు కూడా వాదించేవారు కాదు, హిందువులు కూడా వాదించేవారు కాదు, హిందూముస్లిమ్ సంగమానికి చిహ్నంగా ఉండేది. అందువల్లనే ఉస్మానియాలో ఉర్దూ బోధనాభాషగా ప్రవేశపెట్టడం అన్నది దేశంలో ఒక లౌకిక జాతీయ సంస్కృతిని భాషద్వారా సాధించే ప్రయత్నం. అంజుమనె తరఖీ ఉర్దూకు నేతృత్వం వహించిన మౌల్వీ అబ్దుల్ హక్, గాంధీజీలు 1936లో అఖిల భారతీయ సాహిత్య పరిషద్ లో పాల్గొన్నారు. ముస్లిములకు ఉర్దూ మతపరమైన ప్రాముఖ్యం ఉన్న భాష కాబట్టి దానికి వారు కట్టుబడవచ్చని, అది ఖుర్‌ఆన్ లిపిలో (నిజానికి ఉర్దూ పర్షియన్ లిపి) ఉందని, ముస్లిమ్ రాజులు దానికి ప్రచారం ఇచ్చారని గాంధీజీ మౌల్వీతో అన్నారు. ఈ మాటల పట్ల మౌల్వీ తీవ్రమైన అభ్యంతరాలు చెప్పారు. తర్వాత గాంధీజీ తన మాటలకు విచారం వ్యక్తం చేశారు. గాంధీ వంటి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడవలసిన మాటలివి కాదని మౌల్వీ అన్నారు. మౌల్వీ అబ్దుల్ హక్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ప్రముఖ పాత్ర పోషించిన వ్యక్తి. గాంధీ వ్యాఖ్యల తర్వాత మౌల్వీ "మైనారిటీలుగా మార్చేసిన అనుభవమైందని" చెప్పారు. అంతేకాదు, మౌల్వీ చెప్పిన మరో మాట కూడా గమనించదగింది. ఇలాంటి రాజకీయ భేదాభిప్రాయాలను మతపరమైన ఎజెండాలకు, లౌకిక ఎజెండాకు మధ్య పోటీగా కాదు, లౌకిక ఎజెండాల మధ్య పోటీగా చూడాలని ఆయన చెప్పిన మాటలు 20 శతాబ్దం ప్రారంభం నాటి భారతీయ జాతీయవాదాన్ని పునస్సమీక్షించవలసిన అవసరాన్ని చాటి చెబుతున్నాయి.

దాట్ల కవితా సరస్వతి తన పుస్తకంలో రాసిన మాటలు ముమ్మాటికి నిజం. ఉస్మానియా విశ్వవిద్యాలయం మతపరమైనది కాదు, థియోలాజికల్ కూడా కాదు. అందులో థియోలాజికల్ విభాగం ఒకటి ఉన్నప్పటికీ, దాట్ల ఇచ్చిన గణాంకాల ప్రకారం 1935లో ఉస్మానియాలో 1806 మంది విద్యార్థులు ఉన్నారు. ఆర్ట్స్ చదివేవారు 771, సైన్సు విభాగంలో 731, మెడిసిన్ లో 102, లా విభాగంలో 97, ఇంజనీరింగ్ లో 47, థియోలజీలో కేవలం 32 మంది మాత్రమే. అంటే థియోలజీ అనేది చాలా తక్కువ మంది మాత్రమే చదివేవారు. భారత విద్యావ్యవస్థ పునరుజ్జీవానికి ఉస్మానియా పునాదులు వేసిందని అనేకమంది విద్యావేత్తలు అభిప్రాయపడతారు. ప్రారంభంలో వారానికి మూడు రోజులు మాత్రమే తరగతులు జరిగేవి. థియోలజీ ఒక సబ్జక్టుగా ఉన్నప్పటికీ అప్పటికీ హైదరాబాదులో ఉన్న జామియా నిజామియా విద్యాసంస్థ థియోలాజికల్ స్టడీస్‌కు

పేరెన్నికగన్న సంస్థ. కాబట్టి థియోలాజికల్ స్టడీస్ ఉస్మానియాలో ప్రముఖ మైనవిగా ఉండలేదు. లౌకిక విలువలను ప్రోత్సహించడమే ఎక్కువగా కనబడుతుంది.

ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్శిటీ చేపట్టిన రెండు ప్రాజెక్టులను దాట్ల ప్రస్తావించారు. ముస్లిము చరిత్రలో సెక్యులర్ ఎచీవ్‌మెంట్స్‌ను చాటి చెప్పడం ద్వారా భారత జాతికి ఉపయోగ పడే ప్రాజెక్టులవి. ఒకటి తారీఖె హింద్ (భారత చరిత్ర), సయ్యద్ హాష్మీ ఫరీదాబాదీ రచించారు. రెండవది, తారీఖె ఇస్లామ్ (ఇస్లామ్ చరిత్ర), అబ్దుల్ హలీమ్ షరార్ రచించారు. ఇవి రెండు చరిత్ర పుస్తకాలు. ఈ రెండు పుస్తకాలు జాతీయస్థాయిలోను అంతర్జాతీయ స్థాయిలోను ముస్లిముల పాత్రను చర్చించిన పుస్తకాలు. షరార్, హాష్మీ వీరిద్దరు జాతీయవాదం, ఇస్లామ్ ఈ రెండింటి మధ్య ఈ పుస్తకాల ద్వారా పొంతన సాధించి, జాతీయ సమైక్యతకు, ఒకే జాతి అన్న భావనకు బలం చేకూర్చారు.

ప్రారంభంలో రెండు విభాగాలే ఉన్నప్పటికీ తర్వాత నెమ్మదిగా కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, ఇంగ్లీషు, హిస్టరీ, మాథమెటిక్స్, ఫిజిక్స్, సోషియాలజీ, జియోగ్రఫీ, జూవాలజీ, బోటనీ, జియోలజీ, ఎడ్యుకేషన్, న్యాయశాస్త్రం, మెడిసిన్, అగ్రికల్చర్, వెటరినరీ ఇలా అనేక విభాగాలు ఏర్పడ్డాయి.

సర్ అక్బర్ హైదరీ ఉర్దూ మీడియంలో యూనివర్శిటీ గురించి ప్రతిపాదన పెట్టినప్పుడు రెండు అభ్యంతరాలు ముఖ్యంగా ఉర్దూ మీడియం విషయంలో వచ్చాయి. మొదటి అభ్యంతరం సంస్థానంలో మెజారిటీ ప్రజలు వివిధ భాషలు మాట్లాడే వారున్నారు. ఉర్దూ మాట్లాడేవారి సంఖ్య మైనారిటియే. రెండవ అభ్యంతరం ఉర్దూ మీడియానికి అవసరమైన పాఠ్యపుస్తకాలు లేవు. సర్ హైదరీ ఈ రెండు అభ్యంతరాలకు సరయిన జవాబిచ్చాడు. సంస్థానంలో సాధారణ ప్రజలు వివిధ భాషలు మాట్లాడుతున్నారన్నది నిజమే అయినా, ఉర్దూ మాతృభాష ప్రజల సంఖ్య మైనారిటియే అయినా ఉర్దూ సంస్థానానికి అధికారభాష కావడమే కాదు, సాంస్కృతిక భాషగా కూడా గుర్తింపు పొందిందని, సాధారణంగా కాలేజీ విద్య కోసం వచ్చే విద్యార్థుల కుటుంబాలన్నింటా ఉర్దూ చెలామణిలో ఉందని (మనం 1917 నాటి విషయాలు చర్చిస్తున్నామని గుర్తుంచుకోవడం అవసరం) అందువల్ల ఉర్దూ బోధనాభాషగా ఉండడమే మంచిదని జవాబిచ్చాడు. రెండవ అభ్యంతరం, పాఠ్యపుస్తకాలకు సంబంధించినది, యూనివర్శిటీకి అనుబంధంగా ఒక సంకలన, అనువాద విభాగాన్ని ఏర్పాటు చేయాలని, అనువాదకార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా అవసరమైన పాఠ్యపుస్తకాలను రూపొందించడం కష్టం కాదని అన్నాడు. ఆయన చెప్పిన మాటలు నిజమయ్యాయి. బ్యూరో ఆఫ్ ట్రాన్సలేషన్ కేవలం ఐదు సంవత్సరాల కాలంలో చాలా సబ్జక్టులకు అవసరమైన పుస్తకాలు అనువదించింది. వైజ్ఞానిక విషయాలను బోధించడానికి ఉర్దూ భాష సామర్థ్యాన్ని అందరూ ఒప్పుకోకతప్పలేదు. హిస్టరీ ఆఫ్ ఇండియాలో రచయిత విన్సెంట్ ఏ.స్మిత్ ఈ వాస్తవాన్ని ఇలా రాశాడు:

“వాక్య నిర్మాణంలో ఇంగ్లీషుకు సన్నిహితంగా ఉండే ఉర్దూ భాషలోని సరళత్వం, ఫ్లెక్సిబిలిటీల వల్లనూ, సంస్కృతం, హిందీ, పర్షియన్, అరబీ, ఇంగ్లీషు తదితర భాషాపదాలను కలుపుకోవడం వల్ల ఉర్దూలో ఉన్న అసాధారణ పదసంపద వల్ల ఎలాంటి భావాన్నయినా ప్రకటించే సామర్థ్యం ఉర్దూలో ఉంది. ఏ సబ్జక్టు అయినా, సాహిత్యమైనా, తత్వశాస్త్రమైనా, విజ్ఞాన శాస్త్రమైనా ఉర్దూలో కష్టం కాదు.”

ఉస్మానియా కన్నా ముందే ఏర్పడిన నిజామ్ కాలేజి ఉస్మానియకు అనుబంధం చేయబడింది. నిజామ్ అబ్జర్వేటరీ, మెడికల్ కాలేజి, లా స్కూలు, టీచర్స్ ట్రయినింగ్ కాలేజి ఇలా అనేక సంస్థలు ఉస్మానియాకు అనుబంధమయ్యాయి. అలాంటి సంస్థలలో దాయిరతుల్ మారిఫ్ ముఖ్యమైనది. ఇప్పుడు కూడా ఉస్మానియా ప్రాంగణంలో ఈ విభాగాన్ని చూడవచ్చు. నిజానికి దాయిరతుల్ మారిఫ్ 1888లో ఏర్పడింది. హ్యూమానిటీస్, మతం, సైన్సు, ఆర్ట్సులలో ప్రామాణిక అరబీ గ్రంథాలను సేకరించి, భద్రపరచడానికి, పునర్ముద్రించడానికి ఏర్పడిన విభాగం ఇది. ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ కాలంలో ఏర్పడిన ఈ సంస్థ ప్రపంచఖ్యాతి పొందింది. ఏడవ నిజామ్ కూడా దీనికి అవసరమైన మద్దతిచ్చాడు.

బ్రిటీషువారికి నిజామ్ మిత్రుడిగా ఉన్నప్పటికీ, రెండవ ప్రపంచ

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

యుద్ధంలో అత్యధికంగా సహాయపడినవాడు నిజామే అయినప్పటికీ బ్రిటీషువారిని సవాలు చేస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇంగ్లీషును కాదని ఉస్మానియాలో ఉర్దూ బోధనా భాషగా పెట్టడం అన్నది బ్రిటీషువారికి గొంతు దిగలేదు. బ్రిటీషు ఇండియాలో హైదరాబాదు సంస్థానానికి ఒక ప్రత్యేకత ఉంది. నిజామ్ ప్రపంచంలో ధనికుడు మాత్రమే కాదు, చాలా తెలివైన రాజకీయ నాయకుడు. బ్రిటీషు ప్రాబల్యాన్ని తన చాకచక్యంతో హైదరాబాదులో చాలా పరిమితం చేశాడు. తన ప్రభుత్వాన్ని స్వతంత్రంగా నడుపుకునేవాడు, రైల్వేలు, పోస్టల్ అన్ని హైదరాబాదు ప్రభుత్వ అధీనంలోనే ఉండేవి. ఇలాంటి స్వేచ్ఛ మరో సంస్థానానికి దేనికి అప్పట్లో లేదు. ఈ స్వేచ్ఛను ఉపయోగించుకునే నిజామ్ బ్రిటీషును సవాలు చేస్తున్నట్లు ఉర్దూ మీడియంలో యూనివర్శిటీ ప్రారంభించడంతో ఖంగుతిన్న ఆంగ్లేయులు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇచ్చిన పట్టాలు ఇతర విశ్వవిద్యాలయాలు గుర్తించకుండా చేశారు. ఇతర యూనివర్శిటీల గుర్తింపును నిజామ్ పెద్దగా పట్టించుకున్నట్లు కనబడదు. నిజానికి అప్పట్లో మిగిలిన విశ్వవిద్యాలయాల కన్నా ఉస్మానియాలో ప్రమాణాలు అత్యున్నతంగా ఉండేవని, అసంఖ్యాక పుస్తకాలు ఇంగ్లీషు నుంచి ఉర్దూలోకి అనువాదమయ్యాయని, సైన్సు లేబరెటరీలకు దేశంలో మరెక్కడా లేనివిధంగా అత్యాధునిక సామగ్రిని నిజాం అందజేసాడని, మెడిసిన్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఆస్ట్రానమీ, వెటరినరీ, జియోలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, అగ్రికల్చర్, లీగల్ తదితర శాస్త్రాలన్నింటా ఉస్మానియా అత్యున్నత ప్రమాణాలు సాధించిందని తెలుస్తోంది. దేశం ఆంగ్లపాలనలో ఉన్నంత కాలం ఈ వివక్ష కొనసాగింది. అయితే ఆంగ్ల ప్రభువుల గుర్తింపును నిజామ్ పెద్దగా పట్టించుకున్నట్లు కనబడదు.

సెప్టెంబరు 1948లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తర్వాత ఉర్దూ స్థానంలో ఇంగ్లీషు బోధనాభాషగా మారింది. ఉస్మానియా నేడు అతిపెద్ద విశ్వవిద్యాలయం. దాదాపు 1000 కళాశాలలు అనుబంధంగా ఉన్నాయి. ఆసియాలోనే పెద్దదని చెప్పవచ్చునేమో. దాదాపు 5,50,000 మంది విద్యార్థులు. 1977 నుంచి దూరవిద్యను కూడా ప్రవేశపెట్టడం జరిగింది. ప్రస్తుతం 12 ఫాకల్టీలు, 53 డిపార్టుమెంట్లు, 25 అండర్ గ్రాడ్యుయేట్ కార్యక్రమాలు, 75 పోస్టు గ్రాడ్యుయేట్ కార్యక్రమాలు, అనేకమంది విదేశీ విద్యార్థులతో సాంస్కృతిక సంగమంలా ఉస్మానియా కేంపస్ నేడు కనబడుతుంది.

ఉద్యమాలకు కూడా పురిటిగడ్డ ఉస్మానియా. ఒకప్పుడు వందేమాతరంపై వివాదం అక్కడ చెలరేగింది. అయితే దాట్ల కవితా సరస్వతి ఈ విషయమై రాస్తూ ఈ వివాదానికి హైదరాబాదులో స్వతంత్రపోరాటానికి సంబంధం లేదని అన్నారు. నిజామ్ అనుసరించిన హిందూ ముస్లిమ్ విధానాల ఫలితం అన్న వాదనను కూడా ఆమె ఖండించారు. 1938లో కొందరు విద్యార్థులు తమ హాస్టలు గదుల్లో వందేమాతరం పాడడం ప్రారంభించారు. ఈ గేయంలో రాజకీయ కోణాలుండడం, వివాదస్పద గేయం కావడం (స్వతంత్రానికి పూర్వం వివాదం వేరు) వల్ల దానిపై పాలనా యంత్రాంగం నుంచి అభ్యంతరాలు వచ్చాయి. ఈ గేయం వల్ల హైందవేతరుల మనోభావాలు గాయపడతాయన్న కారణం కూడా అందులో ఉంది. ఈ వివాదాన్ని హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, హిందూమహాసభ వాడుకోవాలని ప్రయత్నించాయని, కాని వందేమాతరం కోసం పట్టుబట్టిన విద్యార్థులు తమ సంఘర్షణ మతపరమైనది కానే కాదని అన్నారని దాట్ల రాశారు. దాట్ల దీనికి ఆధారంగా 1939 జూన్ 3 నాటి హిందూ దినపత్రిక కథనాన్ని ఉటంకించారు. ఈ వివాదం కారణంగా బహిష్కరణకు గురైన విద్యార్థులు తాము వందేమాతరం గేయానికి కట్టుబడి ఉన్నప్పటికీ తమకు హైదరాబాదు రాజ్యం పట్ల, యూనివర్శిటీ పట్ల, మతసామరస్యం పట్ల తమ నిబద్ధత ఉందని స్పష్టంగా ప్రకటించారు. వారి డిమాండ్ ను హైదరాబాద్ ప్రభుత్వం నిరాకరించింది. ప్రాచీన హిందూ ధర్మంలో భాగంగా ఇటీవల రాయబడిన గేయాన్ని (వందేమాతరం రాసింది 1870లో) ఆమోదించడం సాధ్యం కాదని ప్రభుత్వం చెప్పింది. అంటే హిందూధర్మాన్ని వ్యతిరేకిస్తూ వందేమాతరానికి అభ్యంతరాలు రాలేదు.

అప్పటి నుంచి ఉస్మానియా అనేక ఉద్యమాలకు ఊపిరిగా కూడా మారింది. 1952లో హిందీ మాధ్యమంగా కేంద్రప్రభుత్వం విశ్వవిద్యాలయాన్ని స్వాధీనం చేసుకోవాలనుకున్నప్పుడు కూడా విద్యార్థులు ఉద్యమించారు. అదే కాలంలో స్థానికులకు ఉద్యోగావకాశాల కోసం కూడా పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిచాయి. డెబ్బయిలలో తెలంగాణ ఉద్యమం ఉస్మానియాలో ఉధృతంగా ఉపేసింది. నాలుగు దశాబ్దాలు తర్వాత మళ్ళీ ప్రత్యేక తెలంగాణా పోరాటంలోను ఉస్మానియా కేంద్రంగా మారింది.

హైదరాబాద్ సాంస్కృతిక, రాజకీయ పరిణామాల్లో భాగంగా నిలబడిన ఈ విద్యావనం హిందూముస్లిమ్ సామరస్య సంస్కృతికి చిహ్నంగా గర్వంగా విద్యాసేవలందిస్తోంది.

# అబాబీలు

అయూబ్ బాషా

ఉచితాలతో వాతలు, పథకాలతో పెరిగే పన్నులు
రాయితీలతో వలలు, నెరవేర్చలేని హామీలు
త్రిశంకు స్వర్గంలో పేద, మధ్యతరగతి ప్రజలు
"అయ్యూబు"
అభ్యర్థి ఏ పార్టీ వాడో కాదు ఏపాటి వాడో చూడు

ఓట్ల పండుగలప్పుడే గుర్తొచ్చే ఓటరు
వంగి వంగి అరదండాలు పెట్టె లీడరు
నీ మనస్సాక్షి ని నమ్మి నొక్కు బటను
"అయ్యూబు"
ఓటుని అమ్మకు జీవితం తాకట్టు పెట్టకు

పెళ్ళి చేస్తే ఏడేడు తరాలు చూస్తారు
అల్లుడైన కోడలైన కోరి ఎన్నుకుంటారు
పాలించే నాయకుడి ఆరాలు తీయరు
"అయ్యూబు"
ఎవరు ఎక్కువ డబ్బిస్తే వారికే ఓటేస్తారు

ఎన్నికకు ముందు వీరంతా మనవాళ్ళు
ఎన్నికయ్యాక వారు ఎవరయ్యా వాళ్ళు
కార్యకర్తలను పట్టించుకోని నాయకులు
"అయ్యూబు"
గారడితో గాలిలో కడతారు మేడలు

జగతికి జీవనాధారం జలము
పారే నది ఒడ్డునున్న వృథా కానీకు
ప్రగతికి పర్యావరణమే బలము
"అయ్యూబు"
చెట్లనుపెంచి కాలుష్యాన్నినివారించు

భానుడు అగ్నిగుండమయ్యే
ప్రకృతి సమతౌల్యత లేక
జీవితాలు ఎండమావులయ్యే
"అయ్యూబు"
చెట్లు ప్రగతికి మెట్లని తెలియక

నాడు సెలయేరులు, నదులన్ని స్వచ్ఛం
నేడు మురుగుకాల్వలతో అనుసంధానం
ఇరువైపుల భవనాల నిర్మాణం
"అయ్యూబు"
కబ్జాలను ఆపి అరికట్టాలి కలుషితం

నాడు పొలాల్లో ప్రవాహ నీరే త్రాగేవారం
నేడు పంటలు రసాయనాల సమ్మిళితం
త్రాగలేం, తినక తప్పదు పస్తులుండలేం
"అయ్యూబు"
సహజ సిద్ధంగా పండే పంటలు గగనమే

## రామ్ లీలా మైదాన్‌లో ముస్లిం మహాపంచాయత్ నిర్వహణకు అనుమతి

కొన్ని షరతులకు లోబడి డిసెంబర్ 18న రామ్ లీలా మైదాన్లో 'ఆల్ ఇండియా ముస్లిం మహాపంచాయత్' నిర్వహించడానికి మిషన్ సేవ్ కాన్స్టిట్యూషన్ (ఎంఎస్సి)కు అనుమతి ఇచ్చినట్లు ఢిల్లీ పోలీసులు హైకోర్టుకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఏ ఇతర విభాగం అభ్యంతరాలు లేవనెత్తకూడదని నొక్కి చెబుతూ ఎంఎస్సి పిటిషన్ను కోర్టు పరిష్కరించింది. అంతకుముందు, కార్యక్రమ ప్రణాళిక ఖరారు చేయడానికి నిర్వాహకులు, స్థానిక పోలీసులు, ట్రాఫిక్ పోలీసుల మధ్య జరగాల్సిన సమావేశాన్ని ఢిల్లీ ప్రభుత్వం ప్రస్తావించింది. డిసెంబర్ 18న జరిగే బహిరంగ సమావేశానికి సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు అధికారులను ఆదేశించింది. పండుగ సీజన్ కారణంగా ప్రారంభ అనుమతి రద్దు చేయబడింది, కానీ సెలవు దినాల తర్వాత పునఃపరిశీలనకు కోర్టు అనుమతించింది. మరో సంస్థ డిసెంబర్ 3-5న ఈవెంట్ కోసం దరఖాస్తు చేసి వేదిక లభ్యత విషయంలో సమస్యను సృష్టించింది. కాగా కోర్టు డిసెంబర్ 18వ తేదీ ఎంఎస్సీ కార్యక్రమానికి అత్యంత అనుకూలమైన తేదీగా నిర్ణయించింది ❖



# ఈ పిల్లలకు ఏమైంది?!

## డా॥ ముహమ్మద్ హసన్

"విద్య అనేది వ్యక్తిలోని మంచిని బయటకు తీసుకురావడానికి కృషి చేస్తుంది" అంటాడు గ్రీకు తత్త్వవేత్త ప్లేటో. మనిషి ఆటవిక జీవనం నుండి క్రమంగా మానవ వికాసంలో మార్పులు రావటం సామూహిక జీవనానికి అలవాటు పడటం మొదలైన తర్వాత సంజ్ఞల ద్వారా జరిగిన సంభాషణ కాస్తా ఒక రూపాన్ని సంతరించు కోవటం  అనంతరం ఏ ప్రాంతంలోని వారు ఆ ప్రాంతానికి అనుగుణమైన భాషను రూపొందించుకోవటం ఆ తరువాత మనిషి నాగరిక జీవనానికి అలవాటు పడ్డట్టుగా అనేక చారిత్రక ఆధారాలు నిరూపించాయి. వెరసి ఇంత సుదీర్ఘంగా జరిగిన మానవ పరిణామ క్రమంలో ఆదిమ సమాజం నుండి నేడు అంతరిక్షానికి వెళ్తున్న ఆధునిక సమాజం వరకు జరుగుతున్న మానవ అన్వేషణలు అనేక ఫలితాలు ఇస్తున్నాయి. అందులో భాగంగానే నేడు మనం అనుభవిస్తున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం. అరచేతిలో వున్న చరవాణి (సెల్‌ఫోన్) ప్రపంచంలోని ఏ మూలాన ఎం జరుగుతున్నా క్షణాల్లో మన కళ్ళ ముందుంచటం అంటే మానవుడు సాధించిన అద్భుతమైన మేధో వికాసానికి ఉదాహరణ కాకపోతే ఏమిటి? రోజురోజుకు మానవుడు నూతన ఆవిష్కరణ లతో మేధస్సును మధించి కొత్తకొత్త యంత్రాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరిస్తున్నప్పటికి తను కనిపెట్టిన యంత్రాలే భస్మాసుర హస్తం మాదిరిగా మారి మనుషులకు సవాల్ విసరటం కొంత ఆశ్చర్యం కలిగించకమానదు ఉదా: "ఆల్ఫ్రెడ్ నోబెల్" కనిపెట్టిన "డైనమెట్" కావొచ్చు, "రైట్" సోదరులు కనిపెట్టిన "విమానం" కావొచ్చు ఇవి రెండు మనిషి మెదడులోంచి వచ్చిన అద్భుతమైన ఆవిష్కరణలే కాని ఇవి రెండు కూడా రెండో ప్రపంచ యుద్ధంలో(1939-1945) ఎంతటి విధ్వంసానికి కారణం అయినవో అందరికి తెలిసిన విషయమే.

ఇక ప్రస్తుతం మనిషి చేతిలో వున్న మరొక సాంకేతిక పరికరం "సెల్‌ఫోన్". చరవాణి చెరలో నేడు విద్యార్థులు విలువైన సమయాన్ని దుర్వినియోగం చేసుకోవడం బాధ కల్గించే విషయం. చేతిలో పాఠ్యపుస్తకం ఉండాల్సింది పోయి సెల్‌ఫోన్ చేరింది. ఆ మధ్య కాలంలో కేంద్రం చేసిన ఓ సంచలన ప్రకటన ఈ సందర్భంగా ప్రస్తావించాలి. "మరుగుదొడ్డి" లేని ఇంట్లో విలువైన "సెల్ ఫోన్" చేరింది అనేది ఆ ప్రకటన సారాంశం. అంటే ఇక్కడ ఏది ప్రాథమిక అవసరమో, ఏది గౌణ అవసరమో గమనించాల్సిన విషయం, విస్తుగొలిపే వాస్తవం కూడా. జనాభాలో ఎనభై శాతంపైగా సెల్‌ఫోన్ వాడుతున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మూడు సంవత్సరాల క్రితం కరోనా రూపంలో ఓ భయంకరమైన విపత్తు ప్రపంచాన్ని చుట్టుముట్టింది అది ఎలా వచ్చింది, ఏంటి అన్న అంశాల జోలికి పోకుండా "కరోనా" ప్రభావంతో ప్రపంచం మొత్తం స్తంభించి

పోయింది. మనిషి సాధించిన సాంకేతిక పరిజ్ఞానానికి పెను సవాల్ విసిరింది. ఐతే దానికి అంతే తొందరగా మందుని (వ్యాక్సిన్) కనిపెట్టి అదుపులోకి తేగలిగాం. కాని కరోనా సమయంలో విద్యార్థుల విలువైన సమయం వృధా కాకుండా ఉండటం కోసం ప్రత్యక్ష భోదన కాకుండా పరోక్ష బోధనకు నిపుణులు సూచించటం తరగతి గది బోధన కాస్తా ఆన్‌లైన్ బోధనకు శ్రీకారం చుట్టడం జరిగింది.

ఇక ప్రపంచవ్యాప్తంగా దాని దుష్ప్రభావాలు ఇప్పుడిప్పుడే యువతపై ప్రభావం చూయించటం మొదలైనవి. కోవిడ్ పుణ్యమా అని విద్యార్థుల చేతికి వరంలా వచ్చిన "సెల్ ఫోన్" నేడు వారికి శరాఘాతంగా మారిందని చెప్పాలి. కోవిడ్ వ్యాపించిన ఈ మూడు సంవత్సరాల కాలంలో విద్యార్థులు తరగతి గదికి దూరంగా ఉండటం వల్ల తప్పనిసరిగా "మొబైల్ ఫోన్"ను కొనుగోలు చేయాల్సి రావటం ఫలితంగా ఆన్‌లైన్ క్లాసులు ఎంతమంది విని విద్యా ప్రగతిని సాధించారనేది ప్రశ్నార్థకం. కాని నేడు విద్యార్థుల పాలిట అదే "సెల్ ఫోన్" పెను విస్ఫోటనం కలుగ జేస్తుంది అనటంలో సందేహం లేదు. ఇటీవలే హైదరాబాద్‌లో జరిగిన సంఘటనలోని అంశాలు భయం గొలిపేవిధంగా వున్నాయి. నలుగురు మైనర్ విద్యార్థులు "సెల్ ఫోన్"లోని అశ్లీల వీడియోలు చూస్తూ వారు కూడా అలానే చేసి వీడియో తీసి "ఫేస్ బుక్"లో అప్లోడ్ చేయాలని నిర్ణయించుకొని ఓ మైనర్ అమ్మాయిని ఎంచుకోవటం ఆ తరువాత జరిగిన పరిణామాలు మనందరికి తెలిసిన విషయమే.


తరగతి గదిలో గురువు చెప్పే అంశాలపై శ్రద్ధ పెట్టాల్సిన విద్యార్థులు ఏకాగ్రత కోల్పోయి నిత్యం "సెల్ ఫోన్"పై దృష్టిపెట్టి విలువైన సమయం వృధా చేస్తున్నారనేది పరిశోధకుల అభిప్రాయం. ఇంకాస్త ముందుకెళ్తే UNO వారి అనుబంధ సంస్థ ఐన WHO "సెల్ ఫోన్" విద్యార్థులపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. దీనివల్ల దృష్టి మందగించటం ఆందోళన కలగటం, "సెల్‌ఫోన్"తో ఎక్కువ సమయం గడపటం కోసం ఒంటరితనాన్ని ఆశ్రయించటం నిద్రాభంగం, అనైతిక కార్యకలాపాలు, తద్వారా ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొంది. "కరోనా"వల్ల "సెల్ ఫోన్"కు అలవాటుపడిన విద్యార్థులు నేడు దానికి బానిసలుగా మారి అది లేకపోతే ఉండలేని స్థితికి రావటం అంటే ఎంతగా వారిని ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. దీని ద్వారా "నోమోఫోభియా" అనే మానసిక వ్యాధికి గురవుతారని వైద్యులు సూచించటం ఆలోచించాల్సిన విషయం.

ఇక "సెల్ ఫోన్" పిల్లలపై ఇంకా ఎలా పభావం చూపుతుందో మరికొన్ని విషయాలు తెల్సుకుందాం. ఆ మధ్యకాలంలో మలేసియన్ ఆన్‌లైన్ జర్నల్ వారు చేసిన అధ్యయనంలో విద్యార్థులు సుమారు 3-6 గంటల విలువైన సమయాన్ని "సెల్ ఫోన్"తో కాలక్షేపం చేస్తున్నారనేది దాని సారాంశం. అంత మొత్తం విలువైన సమయాన్ని పుస్తకంపై కాకుండా ఉపయోగం లేని "చరవాణితో" కాలక్షేపం చేయడం వల్ల కలిగే పర్యవసానాలు ఎలా ప్రభావం చూపుతున్నాయో చూస్తూనే వున్నాం, ఇక ఈ సందర్భంగానే ఇక్కడ మరొక విషయం ప్రస్తావించాలి ఇటీవల బెంగళూర్ లోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థుల స్కూల్ బ్యాగుల్ని పరిశీలిస్తే అందులో వివిధ రకాల "మాదక ద్రవ్యాలు, సిగరెట్లు, కండోమ్ ప్యాకెట్లు" మొదలైనవి దొరకటం సంచలనంగా మారిన విషయం అందరిని విస్మయానికి గురిచేసింది. దీనిపై స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం వెంటనే తల్లితండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ చేయాలని నిర్ణయించటం అంటే సమస్య తీవ్రత ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

మనిషి జీవితంలో అత్యంత క్రియశీలక పాత్రపోషించేది "టీనేజ్" (13-19 సం. మధ్య) ఈ దశలోనే విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం చేయాలి, అధ్యాపకులు, తల్లిదండ్రులు పిల్లల్లో వస్తున్న శారీరక మానసికపరమైన మార్పులను పసిగట్టి సానుకూల దృక్పదంతో దిశానిర్దేశం చేయాలి, అభ్యాసన లోపాలు ఇంకా ఏమైన అసహజమైన పద్ధతుల్లో వారి ప్రవర్తన ఉన్నట్లయితే ముందే పసిగట్టి వారిని సక్రమ మార్గంలో నడిచేలా ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి.

విద్య పరమావధి వ్యక్తిత్వ వికాసం. వ్యక్తిలో మూర్తిమత్వ వికాసం సమగ్రంగా, సంపూర్ణంగా సమర్థవంతంగా జరగడానికి బాల్యం నుండి మొదలుకొని తరగతి గది నుండి వీడ్కోలు తీసుకొనే స్థాయి వరకు ఒక క్రమ పద్ధతిలో పిల్లవాడికి లభించే సలహా, సహాయం (Counselling & Guidance) ఎంతగానో తోడ్పడు తుంది. కాబట్టి విద్యార్థి క్రియాశీలక భవిష్యత్తుకు ఆటంకం కల్పించే వస్తువులపట్ల (సెల్‌ఫోన్, ఇతర మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు) జాగరూకత లేకపోతే విద్య వ్యవస్థ ప్రమాదంలో పడే ఆస్కారం ఉంది.

అలా కాని పక్షంలో అటువంటి పిల్లలే భవిష్యత్తులో నేరాలకు పాల్పడి సమాజంలోని శాంతి భద్రతలకు విఘాతం కల్గించే అవకాశం లేకపోలేదు. అందుకే పాఠశాల స్థాయి నుండి డిగ్రీ లోపు విద్యార్థులకు తరగతి గదిలోకి "సెల్ ఫోన్" అనుమతించ కుండా కఠిన ఆంక్షలు విధించాలి లేనిపక్షంలో విద్యార్థి ఏకాగ్రత దెబ్బ తిని మధ్యలోనే (వృధా, స్తబ్దత) చదువు నుండి నిష్క్రమించే అవకాశం కూడా ఉంటుంది.




**మన** హృదయం రోజుకు 100,000 సార్లు కొట్టుకొంటుంది. కానీ సమస్య ఉంటే తప్ప గుండె నిర్వహణ గురించి మనం ఆలోచించం. మన గుండెను ఎలా ఆరోగ్యంగా ఉంచుకోవాలో అనే దానిపై నలుగురు బ్రిటిష్ కార్డియాలజిస్టుల సలహాలు:

1. వ్యాయామం కీలకం

వారానికి 150 నిమిషాల చురుకైన నడక ఉండాలి లేదా రన్నింగ్ లేదా సైక్లింగ్ వంటి 75 నిమిషాల అధిక తీవ్రత వ్యాయామం ఉండాలి

2. శరీరం ఏమి చేయగలదో తెలుసుకోండి

ప్రతి సంవత్సరం సాధారణ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయి, మధుమేహ ప్రమాదాన్ని పర్యవేక్షించాలి.

3. వ్యాయామం అతిగా చేయడం కూడా చెడు కావచ్చు

ఎక్కువ వ్యాయామం గుండెకు హాని కలిగించవచ్చని కొన్ని ఆధారాలు ఉన్నాయి. అంతర్లీన కరోనరీ వ్యాధి గురించి తెలియకుండా ప్రజలు తమను తాము అతిగా ప్రవర్తించడం. మారథాన్‌ల సమయంలో ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు కుప్పకూలిపోవడానికి లేదా సైక్లింగ్‌కు వెళ్లే మధ్యవయస్కులకు గుండెపోటు రావడానికి ఇది ఒక కారణం కావచ్చు.

4. నిశ్చల జీవనశైలిని నివారించండి

5. అధిక కొలెస్ట్రాల్ సమస్యాత్మకంగా ఉంటుంది

అధిక కొలెస్ట్రాల్ వలన గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యలు వస్తాయి. గుండెపోటుకు కారణమవుతుంది.

6. వారసత్వంగా వచ్చే ప్రమాదాన్ని అంచనా వేయాలి

మీ కుటుంబంలో 60 ఏళ్లలోపు గుండెపోటు వచ్చిన కుటుంబ సభ్యుడు ఉంటే, మీరు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి. వారసత్వంగా గుండె సమస్య ఉన్న వారు డాక్టర్ చేత తప్పనిసరిగా తనిఖీ చేయించుకోవాలి. వారసత్వంగా వచ్చిన పరిస్థితితో సురక్షితంగా జీవించడం ఎలా అనే సమాచారాన్ని తెలుసుకోవడం చాలా ముఖ్యం.

7. ఆహారం ఒక సమగ్ర పాత్ర పోషిస్తుంది

మధ్యస్థ శైలి ఆహారాన్ని తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, గింజలు, పప్పులు రక్త నాళాలకు మంచివి, గుండెకు మంచివి. చెడు కొలెస్ట్రాల్, వాపు, రక్తపోటును తగ్గించడంలో ఆయిల్ ఫిష్ నిజంగా మంచిది.

8. అనారోగ్యకరమైన ఆహారాలకు దూరంగా ఉండండి

"కొవ్వులను- ముఖ్యంగా సంతృప్త కొవ్వును- ఆహారంలో ఉంచే నూనె మొత్తాన్ని తగ్గించడానికి ప్రయత్నించండి. కార్బోహైడ్రేట్లను

కూడా తగ్గించండి. పిండి పదార్థాలను సగానికి కట్ చేసి, మీ ప్లేట్‌లోని మిగిలిన భాగాలను తెల్ల మాంసం, చేపలు, కూరగాయలతో నింపండి. జంక్ ఫుడ్ మానేయండి. అతిగా తినడం వద్దు.

9. ధూమపానం నివారించండి

ధూమపానం మానేయడం వలన ఆయుర్దాయం గణనీయంగా మెరుగుపడుతుంది. ధూమపానం, మత్తుపదార్థలు, ఆల్కహాల్ వలన ఆకస్మిక గుండెపోటు లేదా దీర్ఘకాలంలో గుండె జబ్బులు రావచ్చు.

10. నిద్రకు ప్రాధాన్యత ఇవ్వండి

రోజుకు ఎనిమిది గంటలు నిద్రపోవడానికి ప్రయత్నించడం చాలా ముఖ్యం. నిద్రవేళకు ముందు స్క్రీన్‌లను నివారించడం, విశ్రాంతికి ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యం.

11. ఒత్తిడి అనారోగ్య అలవాట్లకు దారితీస్తుంది

"మానసికంగా ఒత్తిడి హృదయానికి చెడ్డది. యుక్తవయస్కులు ధ్యానం అయినా లేదా నడక లేదా విశ్రాంతి ద్వారా ఒత్తిడి తగ్గించుకోవాలి.

12. గుండె వేగంగా కొట్టుకోవడం

మనం ఆత్రుతగా లేదా భయాందోళనకు గురైనప్పుడు హృదయ స్పందన పెరుగు తుంది. ఇది కొన్నిసార్లు ఒక సాధారణ దృగ్విషయం కావచ్చు - కానీ దడ, ఒక లక్షణంగా, ప్రత్యేకించి ఊపిరి పీల్చుకోవడంలో అసౌకర్యం, ఛాతీ నొప్పిని అనుభవిస్తున్నట్లయితే, వారు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి.

13. సీపీఆర్ ఎలా చేయాలో మనమందరం నేర్చుకోవాలి

CPR కార్డియోపల్మోనరీ పునరుజ్జీవనం ఎలా చేయాలో ప్రజలకు తెలుసుకోవడం ముఖ్యం.

14. గుండెపోటు తర్వాత, డ్రైవింగ్, సెక్స్‌కు ఒక నెలపాటు దూరంగా ఉండాలి.

15. స్టాటిన్స్ ప్రాణాలను రక్షించగలవు

"గత 20 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలంగా, స్టాటిన్స్ వంటి మందులతో కొలెస్ట్రాల్‌ను తగ్గించడం వల్ల గుండె జబ్బులకు సంబంధించిన మరణాలు గణనీయంగా తగ్గాయి". "స్టాటిన్స్ సాధారణంగా గుండె జబ్బులు ఉన్న రోగులందరికీ సూచించబడతాయి. పెరిగిన కొలెస్ట్రాల్ లేదా ఇతర కారకాల వల్ల ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు భావించే వారికి కూడా సూచించ బడుతుంది."

('ది గార్డియన్' సౌజన్యంతో...)


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# ప్రజా తీర్పు

**- ముహమ్మద్ అబ్దుర్రషీద్**

**తెలంగాణలో** 2023 అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి ఫలితాలు వచ్చాయి. గుణపాఠం నేర్పాయి. పాలకులు ఎవరైనా సరే ప్రజల బాగోగులు చూడాలి. వారికి ప్రశాంతమైన జీవితం ఇవ్వాలి.

మొన్న మొన్ననే రఘునందన్ గారిని, ఈటెల రాజేందర్ గారిని, బండి సంజయ్ గారిని ఇంకా తదితరులను గెలిపించుకున్న ప్రజలే ఈరోజు ఓడించారు. ఎంత తెలివైన వారు ప్రజలు!? ప్రజల తెలివితేటలను పార్టీలు, నాయకులు గమనించాలి.


అదేవిధంగా బిజెపి 8 సీట్లకు బలం పెరగడంలో కూడా ప్రజల తీర్పు గమనార్హం. ఎప్పుడైతే పార్టీలు, నాయకులు ప్రజలను చులకనగా చూస్తారో అప్పుడు ఎన్నికలలో ప్రజలు తమ తీర్పులు నిర్మోహమాటంగా చెబుతారు. అందుకే పార్టీలు గానీ, నాయకులు గానీ కళ్ళు మూసుకొని ప్రకటనలు చేయరాదు. ప్రజలు మేల్కొని ఉన్నారు, స్పృహలో ఉన్నారు అనే విషయాలు మనకి 2003లో జరిగిన ఎన్నికలు తెలియజేస్తున్నాయి.

గత ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి రైతుబంధు, ఆసరా, వికలాంగుల పెన్షన్, మొదలైన అనేక పథకాలు పెట్టింది. కొద్దోగొప్పో లొసుగులు ఏర్పడ్డాయి. ప్రజలు ప్రయోజనం పొందినప్పటికీ ఓవరాల్‌గా ప్రభుత్వంపై వ్యతిరేక ఏర్పడింది. ఫలితంగా మార్పు జరగాలన్న అభిప్రాయం బలపడింది. అందువల్ల టిఆర్ఎస్ 81 నుండి 39 కి దిగజారింది. కాంగ్రెస్ 64కు ఎగబాకింది.

ఎంఐఎంది మరొక ధోరణి. గత దశాబ్దాల నుండి మొత్తం తెలంగాణలో ఏడు సీట్లకే పరిమితమైపోయింది. ఎంఐఎం పార్లమెంటు నియోజకవర్గంలో గోషామహల్ ఉంది. గోషామహల్‌లో ఎంఐఎం పార్టీ ఆఫీస్ ఉంది. గోషామహల్‌లో 80 వేల మంది ముస్లిం ఓటర్స్ ఉన్నారు. అయినా ఎంఐఎం తన అభ్యర్థిని నిలబెట్టదు. కానీ అదే ఇతర రాష్ట్రాలలోకి వెళ్లి బల్దియా ఎలక్షన్లలోనూ, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో తమ అభ్యర్థులను నిలిపి అక్కడక్కడ గెలిపించుకుంటుంది కూడా. కానీ తెలంగాణ ప్రాంతంలో మాత్రం విస్తరించదు. గోషామహల్ విషయానికి వస్తే మేము బీఆర్ఎస్‌తో ఉన్నాము కనుక గోషామహల్‌లో బిఆర్ఎస్ అభ్యర్థికి సపోర్ట్ చేస్తున్నాము అంటున్నారు. ఈ విషయమే ఈసారి ముస్లింలలో ఎంఐఎం పట్ల వ్యతిరేకత జనింపజేంది. దీనికి తోడు ఓటింగ్ శాతం పడిపోవడం కూడా గమనించదగ్గ విషయం.

ఈ ఎన్నికలలో ముఖ్యమైన విషయం ఏమిటంటే జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ జోన్ ఓటర్లకు ఒక స్పష్టమైన మార్గదర్శనం ఇచ్చింది. ఆ ప్రకారంగా ప్రజలు అర్థం చేసుకుని ఓటు వేయడానికి దోహదపడింది.

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**